

Succeeded Advocacy on ratification of UNCRPD by
Govt. of India in 2007 by Legendary Sri. Javed Abidi (1965 - 2018)

# ఐక్యరాజ్య సమితి
# వైకల్యం గల వ్యక్తుల హక్కుల
# ఒడంబడిక

## UNCRPD

United Nation Convention on the Rights of Persons with Disabilities
Ratified by Government of India in 2007

United Nations

# ఐక్యరాజ్య సమితి వైకల్యం గల వ్యక్తుల హక్కుల ఒడంబడిక

# పీఠిక

ప్రస్తుత ఒప్పందం (ప్రకటన)కు ఆమోదం తెలిపే సభ్యదేశాలు....

(ఎ) మానవ కుటుంబంలోని అందరూ సహజ గౌరవం, సమాన విలువ, బదలాయింపు కాని అన్ని హక్కులనూ సమానంగా ఆస్వాదిందించడమే ప్రపంచంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, న్యాయం, శాంతికి పునాది అని గుర్తించే ఐక్యరాజ్య సమితి ప్రకటన (యుఎన్ చార్టర్)ను జ్ఞాపకంచేస్తూ...

(బి) అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన, మానవ హక్కులపై అంతర్జాతీయ ఒడంబడికల ద్వారా మానవులందరూ ఎలాంటి వివక్షకు తావు లేకుండా నిర్దేశిత స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, హక్కులన్నిటికీ అర్హులని ఐక్యరాజ్యసమితి చేసిన ఉద్ఘాటనను జ్ఞాపకంచేస్తూ...

(సి) అన్ని మానవ హక్కులూ, ప్రాథమిక స్వేచ్ఛలు విశ్వజనీనమని, విడదీయలేనివని, ఒకదానిపై మరొకటి ఆధారపడి వున్నవని, ఒకదానితో ఒకటి ముడిపడి ఆధారపడి వున్నాయని, వైకల్యం గల వ్యక్తులు ఈ హక్కులన్నిటినీ ఎలాంటి వివక్ష లేకుండా ఆస్వాదించాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటిస్తూ...

(డి) అంతర్జాతీయ ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కుల ఒడంబడిక, అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల ఒడంబడిక, అన్నిరూపాలలోని జాతి వివక్షతను రూపు మాపేందుకు అంతర్జాతీయ ఒప్పందం, మహిళలపై అన్ని రకాల వివక్షలను అంతమొందించేందుకు అంతర్జాతీయ ప్రకటన, హింస, ఇతర అవమానకరమూ, క్రూరమూ, అమానుషమూ, అయిన శిక్షా పద్ధతులను అంతమొందించేందుకు అంతర్జాతీయ ఒప్పందం, బాలల హక్కులపై ఒప్పందం, అన్ని రకాల వలసకార్మికులు, వారి కుటుంబ సభ్యుల హక్కుల పరిరక్షణకు అంతర్జాతీయ ఒప్పందాలను జ్ఞాపకం చేసుకుంటూ...

(ఇ) వైకల్యం ఇంకా ఏర్పడుతున్న భావన అని వైకల్యం గల వ్యక్తులూ వ్యవహారిక, వాతావరణపరమైన అవరోధాలు గల వ్యక్తుల దృక్పదాల నుంచి వైకల్యం ఉద్భవిస్తుందని, ఇది వైకల్యం గల వ్యక్తులు మిగిలిన సాధారణ మనుషులతో సమానంగా సమాజంలో పూర్తిస్థాయి పాత్రవహించడానికి అవరోదమని గుర్తిస్తూ...

(ఎఫ్) వైకల్యం గల వ్యక్తుల కోసం ప్రపంచ కార్యాచరణ ప్రణాళికలోను, అలాగే, అంతర్జాతీయ జాతీయ, ప్రాంతీయ స్థాయిలలో విధానాలు, ప్రణాళికలు,

కార్యక్రమాలు, కార్యాచరణలను ప్రభావితం చేయడంలో వైకల్యం గల వ్యక్తులకు సమాన అవకాశాలు కల్పించడానికి ప్రామాణిక నిబంధనలలోని సూత్రాలు, విధాన
మార్గదర్శకాల ప్రాముఖ్యతను గుర్తిస్తూ...

(జి) స్థిరమైన అభివృద్ధికి రూపొందించే వ్యూహాలలో అంతర్భాగం చేసేలా వైకల్యం అంశాలను ప్రధాన స్రవంతిలోకి తేవలసిన అవసరాన్ని నొక్కిచెప్తూ ...

(హెచ్) వైకల్యం కారణంగా ఏవ్యక్తిపట్లనైనా వివక్షచూపడం వ్యక్తి సహజ గౌరవానికి, విలువకు భంగం కలిగిండమేనని కూడా గుర్తిస్తూ...

(ఐ) వైకల్యంగల వ్యక్తుల భిన్నత్వాన్ని కూడా గుర్తిస్తూ...

(జె) ప్రత్యేక, అధిక తోడ్పాటు అవసరమైన వారితో సహా వైకల్యం గల వ్యక్తులందరి మానవ హక్కుల పరిరక్షణ, అభివృద్ధి అవసరాన్ని గుర్తిస్తూ...

(కె) ఇన్ని ఏర్పాట్లు, హామీలు ఉన్నప్పటికీ వైకల్యం గల వ్యక్తులు ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రాంతాలలోనూ సమాజంలో సమాన పౌరులుగా భాగస్వామ్యం వహించడంలో అవరోధాలను ఎదుర్కొంటూనే ఉండటం పట్ల ఆవేదనతో...

(ఎల్) అన్ని దేశాలలోను, ప్రత్యేకించి అభివృద్ధి చెందుతున్న దేశాలలో వైకల్యం గల వ్యక్తుల జీవన పరిస్థితులను మెరుగు పరచడానికి అంతర్జాతీయ సహకారం అవసరాన్ని గుర్తిస్తూ...

(ఎం) తమతోటి వారి అభ్యున్నతి, సమగ్ర పురోగతి, సంక్షేమం కోసం వైకల్యం గల వ్యక్తులు అందించిన, అందిస్తున్న విలువైన సేవలను గుర్తిస్తూ, అలాగే, వైకల్యం గల వ్యక్తులు తమ మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛాస్వాతంత్ర్యాలన్నిటినీ పూర్తిగా ఆస్వాదించేలా చేయడం వల్ల వారిలో సమాజం తమ సొంతమన్న భావనను పెంపొందించడం, సమాజంలో మానవ, ఆర్థిక, సాంఘిక అభివృద్ధికి, పేదరిక నిర్మూలన దిశగా మరింత పురోగతి సాధించవచ్చని గుర్తిస్తూ...

(ఎన్) వైకల్యం గల వ్యక్తుల వ్యక్తిగత స్వయం ప్రతిపత్తిని, స్వేచ్ఛను వారి సొంత ఎంపికల స్వేచ్ఛతోసహా గౌరవించ వలసిన అవసరాన్ని గుర్తిస్తూ...

(ఒ) ప్రత్యక్షంగా తమకు సంబంధించిన అంశాలతో సహా, అన్ని విధాన నిర్ణయాలు, కార్యక్రమాల రూపకల్పన ప్రక్రియలలో వైకల్యం గల వ్యక్తులు క్రియా శీలక పాత్రపోషించే అవకాశం కల్పించాల్సిన అనవసరాన్ని, ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని ...

(పి) వైకల్యం గల వ్యక్తులు తెగ, రంగు, లింగ, భాష, మతం, రాజకీయ, రాజకీయేతర

అభిప్రాయం, జాతీయత, వర్గం, సాంఘీక నేపథ్యం, ఆస్తి, జననం, వయసు, మరే ఇతర అంశాలలోనైనా వివిధ రకాల, లేదా విపరీత రూపాల వివక్షకు గురికావడం పట్ల ఆందోళనతో...

(క్యు) వైకల్యం గల మహిళలు, బాలికలు ఇంట్లోను, ఇంటి బయట హింస, దెబ్బలు, నిర్లక్ష్యం, నిర్లక్ష్యపూరిత ఆదరణ, నిరాదరణ, దోపిడికి గురయ్యే అవకాశాలు ఎక్కువని గుర్తిస్తూ...

(ఆర్) వైకల్యం గల బాలలు మిగిలిన బాలలతో సమానంగా అన్ని మానవ హక్కులు, ప్రాథమిక స్వాతంత్ర్యాలను ఆస్వాదించవలసిన అవసరాన్ని, బాలల హక్కుల ఒప్పందాన్ని ఆమోదించడం ద్వారా ఆయాదేశాలు ఈ మేరకు బాధ్యత తీసుకున్న విషయాన్ని గుర్తిస్తూ...

(ఎస్) వైకల్యం గల వ్యక్తులు అన్ని మానవ హక్కులను, మౌలిక స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఆస్వాదించేలా చేసేందుకు జరిగే కృషిలో లింగ (జెండర్) దృక్పథాన్ని జోడించవలసిన అవసరాన్ని గుర్తిస్తూ...

(టి) వైకల్యం గల వ్యక్తులు అధిక శాతం మంది పేదరికంలో జీవిస్తున్నారన్న వాస్తవాన్ని ఈ వ్యక్తులపై పేదరికం చూపే ప్రతికూల ప్రభావాన్ని తొలగించేందుకు కృషి చేయ వలసిన అవసరాన్ని గుర్తిస్తూ...

(యు) వైకల్యం గల వ్యక్తులకు, ప్రత్యేకించి యుద్ధ సందర్భాలు, విదేశీ దురాక్రమణల సందర్భాలలో, రక్షణ కల్పించడానికి ఐక్యరాజ్య సమితి చాప్టర్‌లో నిర్దేశించిన ప్రయోజనాలు, సూత్రాలను పూర్తిగా గౌరవించడం, తత్సంబంధిత మానవ హక్కుల ఏర్పాట్లను అమలు చేయడం ద్వారా శాంతి, రక్షణ కల్పించడం అనివార్యమని దృష్టిలో ఉంచుకుని...

(వి) వైకల్యం గల వ్యక్తులు మానవ హక్కులూ, ప్రాథమిక స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పూర్తి స్థాయిలో ఆస్వాదించడానికి భౌతిక, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక వాతావరణాలకు, ఆరోగ్యం, విద్యతోపాటు సమాచారం, సమాచార చేరవేతకు ఆస్కారం కల్పించవలసిన అవసరాన్ని గుర్తిస్తూ...

(డబ్ల్యు) తన వర్గానికి చెందిన ఇతర వ్యక్తులకు, సమూహాలకు బాధ్యత నిర్వర్తించవలసిన విధి ఉన్న వ్యక్తులు అంతర్జాతీయ మానవ హక్కుల బిల్లు (ఇంటర్నేషనల్ బిల్ ఆఫ్ హ్యూమన్‌రైట్స్) ను అమలు పరచవలసిన, ప్రోత్సహించ వలసిన బాధ్యత ఉందని గుర్తిస్తూ...

(ఎక్స్) కుటుంబం సమాజంలో సహజమూ, ప్రాథమికమూ అయిన ఒక సమూహము

అని, దీనికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత సమాజం, ప్రభుత్వంపై ఉందని, వైకల్యం గల వ్యక్తులు వారికి వున్న మానవ హక్కులను పూర్తిస్థాయిలో ఆస్వాదించడానికి వారి కుటుంబాలు వారికి సహకరించేందుకు అవసరమైన సహాయ సహకారాలను అందించాల్సిన అవసరం ఉందని భావిస్తూ...

(వై) వైకల్యం గల వ్యక్తుల హక్కులు, గౌరవాలను పరిరక్షించి, ప్రోత్సహించడం కోసం ఒక సమగ్రమైన సమ్మిళితమైన అంతర్జాతీయ ఒప్పందం వీరు ఎదుర్కొంటున్న భయానకమైన సాంఘీక సవాళ్ళన్ను తొలగించడంలో విశేష పాత్ర పోషిస్తుందని, రాజకీయ, పౌర, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో వీరు సమాన అవకాశాలతో భాగస్వాములు కావడానికి- అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలలో దోహదం చేస్తుందని విశ్వసిస్తూ...

## ఈ క్రింది విధంగా అంగీకరిస్తున్నాయి :

### ఆర్టికల్-1: ఉద్దేశ్యం

వైకల్యంగల వ్యక్తులు మిగిలిన అందరితో సమానంగాను, పూర్తిస్థాయిలోను మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను ఆస్వాదించేలా ప్రోత్సహించడం, వారి హక్కులకు రక్షణ కల్పించడం, వారి సహజ గౌరవాన్ని పరిరక్షించడం-పెంపొందించడం కోసం ఉద్దేశించిన ఒడంబడిక ఇది.

దీర్ఘకాలిక భౌతిక, మానసిక, తెలివి తెటల పరమైన, స్పర్శాపరమైన వైకల్యాలతో ఉండి, వీటి కారణంగా మిగిలిన అందరితో సమానంగా సమాజంలో పాత్ర వహించలేని వారందరూ వైకల్యం గల వ్యక్తులుగా పరిగణించ బడతారు.

### ఆర్టికల్-2: నిర్వచనాలు

ప్రస్తుత ఒప్పందంలో పదాలు, పదప్రయోగాలకు అర్థాలు కింది విధంగా ఉంటాయి...

**"సమాచారం అందజేత" (కమ్యూనికేషన్)** అంటే **:** భాషలు, రాసిన అంశం ప్రదర్శన, బ్రెయిలీ, సైగల భాష, పెద్ద అక్షరాలలో ముద్రణ, మల్టీమీడియా అందుబాటు, అలాగే లిఖితపూర్వక, దృశ్యరూప, సాధరణ భాష, హ్యూమన్-రీడర్, ఇతర ప్రత్యామ్నాయ లేదా సహాయ పద్ధతులు, సమాచారాన్ని అందజేసే పద్ధతులూ, రూపాలూ అందుబాటులోఉన్న సమాచార, సాంకేతిక పరిజ్ఞానంతో సహా...

**"భాష"** అంటే **:** మౌఖిక భాష, గుర్తులతో(సైన్) కూడిన భాష, మాట్లాడని (నాన్–స్పోకెన్) ఇతర భాషారూపాలు.

**"వైకల్యం ప్రాతిపదికగా వివక్ష"** అంటే **:** రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, సాధారణ, లేక మరే ఇతర రంగాలలోనైనా ఇతరులతో సమానంగా అన్ని మానవ హక్కులను, ప్రాథమిక స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను ఆస్వాదించడానికి, అందుకోవడానికి, వినియోగించుకోవడానికి భంగం కలిగించేలా భేదం చూపడం, మినహాయించడం, పరిమితి విధించడం. తగిన వసతి కల్పించడానికి నిరాకరించడంతో సహా అన్ని రకాల వివక్షతలూ ఈ నిర్వచనంలోకి వస్తాయి.

**"తగిన వసతి"** అంటే **:** అన్ని మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను మిగిలిన అందరితో సమానంగా వైకల్యంగల వ్యక్తులు ఆస్వాదించేలా, వినియోగించుకునేలా చూసేందుకు ఒక నిర్దిష్ట సందర్భంలో అవసరమైనపుడు అసమంజసమైన, లేక, అనవసరమైన భారం మోపకుండా తగిన మార్పులు, సర్దుబాట్లు చేయడం.

**"సార్వత్రిక రూపకల్పన" (యూనివర్సల్ డిజైన్)** అంటే : కొత్తగా అలవాటు పడవలసిన అవసరంగాని, ప్రత్యేక రూపకల్పన గాని లేకుండా సాధ్యమైన మేరకు ప్రజలందరూ ఉపయోగించుకునేలా ఉత్పత్తులు, పరిస్థితులు, కార్యక్రమాలకు, సేవలను రూపొందించడం. అవసరమైన చోట వైకల్యం గల వ్యక్తుల నిర్దిష్ట వర్గానికి తోడ్పడే అంశాలను ఈ "సార్వత్రిక రూపకల్పన" విస్మరించకూడదు.

## ఆర్టికల్ - 3 : సాధారణ సూత్రాలు, ప్రస్తుత ఒప్పందపు సూత్రాలు ఈ క్రింది విధంగా ఉండాలి.

(ఎ) వ్యక్తి సహజ హుందాతనం, ఒకవ్యక్తి తనసొంత ఇష్టాల ప్రకారం ఎంపిక చేసుకోవడంతో సహా అన్ని రకాల వ్యక్తి స్వయం ప్రతిపత్తి, వ్యక్తుల స్వాతంత్ర్యానికి గౌరవం ఉండాలి.

(బి) వివక్షత ఉండరాదు.

(సి) సమాజంలో పూర్తిస్థాయిలో, సమర్థవంతంగా భాగస్వామ్యం వహించడం, సమాజంలో విలీనం చేయడం.

(డి) మానవ వైవిధ్యం (విభిన్నత), మానవత్వంలో భాగంగా వైకల్యం గల వ్యక్తుల తేడాకు గౌరవంతో పాటు వారిని అంగీకరించాలి.

(ఇ) సమాన అవకాశాలు

(ఎఫ్) అందుబాటు

(జి) మహిళలు-పురుషుల మధ్య సమానత

(హెచ్) వారి వారి ప్రత్యేక గుర్తింపులను నిక్షిప్తం చేసేలా వైకల్యం గల బాలల్లో ఏర్పడే సామర్థ్యాలను గౌరవించడం, వైకల్యం గల బాలల హక్కులను గౌరవించడం.

**ఆర్టికల్-4: సాధారణ బాధ్యతలు**

1 వైకల్యానికి సంబంధించి ఎలాంటి వివక్షతలేకుండా వైకల్యం గల వ్యక్తులందరూ తమ మానవ హక్కులను, ప్రాథమిక స్వేచ్ఛలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా, మరింత పురోగమింప జేస్తామని భాగస్వామ్య దేశాలు (ప్రభుత్వాలు) ఈ క్రింది బాధ్యతలు తీసుకున్నాయి.

(ఎ) ప్రస్తుత ఒప్పందంలో గుర్తించిన హక్కుల అమలు కోసం అవసరమైన చట్టపరమైన, పరిపాలనా పరమైన, ఇతర చర్యలన్నీ తీసుకుంటామని బాధ్యత తీసుకున్నాయి.

(బి) వైకల్యం గల వ్యక్తుల పట్ల వివక్షతను కనబరిచే ప్రస్తుత చట్టాలు, క్రమబద్ధీకరణలు, సాంప్రదాయాలు, ఆచారాలన్నిటినీ మార్చడం లేదా ఎత్తివేయడానికి బాధ్యత తీసుకున్నాయి.

(సి) అన్ని కార్యక్రమాలు, విధానాలలో వైకల్యం గల వ్యక్తుల మానవ హక్కుల పరిరక్షణ, మెరుగుదల అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చాయి.

(డి) ప్రస్తుత ఒప్పందానికి విరుద్ధంగా ఉండే ఎలాంటి కార్యక్రమాలు, ఆచారాలకు పాల్పడబోమని, ప్రభుత్వ సంస్థలు, అధికారులు అందరూ ఈ ఒప్పందానికి అనుగుణంగా నడుచుకునేల చూస్తామని బాధ్యత తీసుకున్నాయి.

(ఇ) వైకల్యం ప్రాతిపదికగా ఏవ్యక్తి, సంస్థ, ప్రైవేటు వ్యవస్థ కూడా వివక్షకు పాల్పడకుండా నిరోధించేందుకు తగిన చర్యలన్నిటినీ తీసుకునే బాధ్యతను చేపట్టాయి.

(ఎఫ్) ప్రస్తుత ఒప్పందపు ఆర్టికల్-2లో నిర్వచించిన విధంగా, వైకల్యం గల వ్యక్తుల నిర్దిష్ట అవసరాలకు ఉపయోగపడేందుకు వీలుగా సార్వత్రికదృష్టితో వస్తువులు, సేవలు, పరికరాలు, సదుపాయాల రూపకల్పనకు పరిశోధనలను, ప్రయోగాలను చేపట్టి, ప్రోత్సహించడం, తక్కువ వ్యయంతో, ఎక్కువ కష్టపడ వలసిన అవసరం లేకుండా వినియోగించుకునేలా వీటి తయారీని, అందు బాటును నిర్దిష్ట ప్రమాణాలు, మార్గదర్శకాల పరిధిలో జరిగేట్లు చూస్తామని బాధ్యత తీసుకున్నాయి.

(జి) ధరలు అందుబాటులో ఉండేలా చూస్తూ, వైకల్యం గల వ్యక్తులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానం సమాచార, సాంకేతిక పరిజ్ఞానంతో సహా వారి కదలికకు ఉపయోగించే సాధనాలు, పరికరాలు సహాయఉపకరణాలు, వగైరా వస్తువుల పరిశోధన, తయారీని చేపట్టాలి.

(హెచ్) వైకల్యం గల వ్యక్తులకు వారికి అవసరమైన పరికరాలు, సహాయోపకరణాలు, కొత్త పరిజ్ఞానం, ఇతర అన్ని రకాల సహాయ అంశాలు, సేవలు, సదుపాయాలు, వస్తువులకు సంబంధించిన సమాచారాన్ని అందించాలి.

(ఐ) వైకల్యం గల వ్యక్తుల కోసం వారితో కలిసి పని చేసే వారికి ప్రస్తుత ఒప్పందం ద్వారా వైకల్యం గల వ్యక్తులకు లంభించిన హక్కుల గురించి శిక్షణ నివ్వడం ద్వారా వీరికి అందే సహాయ సహకారాలు, సేవలను వారికి తెలియ జేసేందుకు కృషి చేసే బాధ్యతను చేపట్టాయి.

2. ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కులకు సంబంధించినంత వరకు ప్రతి దేశమూ తనకున్న వనరుల పరిధిలోను, అవసరమైన చోట్ల అంతర్జాతీయ సహకారం ఏర్పాటు పరిధిలోను వైకల్యం గల వ్యక్తులందరూ తమ హక్కులను పూర్తిస్థాయిలో అందు కునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, ప్రస్తుత ఒప్పందం ప్రకారం, అంతర్జాతీయ చట్టం ప్రకారం ప్రభుత్వాలకు తక్షణమే సంక్రమించిన బాధ్యతలతో ప్రమేయం లేకుండా ఈ కార్యక్రమం చేపడతామని బాధ్యత తీసుకున్నాయి.

3. ప్రస్తుత ఒప్పందం అమలుకోసం చట్టాలు రూపొందించడం, అమలు చేయడంలోను, అలాగే వైకల్యం గల వ్యక్తుల ఇతర నిర్ణయాల ప్రక్రియలోను ప్రభుత్వాలు వైకల్యం గల వ్యక్తులను, బాలలను వారివారి సంస్థల ద్వారా ఈ ప్రక్రియలలో వారిని భాగస్వాములను చేయాలి.

4. వైకల్యం గల వ్యక్తులకు మరింత సానుకూలంగా ఉన్న ఏ దేశ, అంతర్జాతీయ చట్టం, ఏర్పాటుకు ఈ ఒప్పందంలోని ఏ అంశమూ విఘాతం కలిగించరాదు. వైకల్యం గల వ్యక్తుల కోసం అమలులో ఉన్న ఏ సానుకూల చట్టాన్ని గాని, ఈ ఒప్పందం ఆ విషయాన్ని ప్రస్తావించలేదనో, హామీ ఇవ్వలేదనో తొలగించరాదు.

5. ప్రస్తుత ఒప్పందపు అంశాలన్నీ సమాఖ్య దేశాలన్నిటికీ ఎలాంటి పరిమితులు, మినహాయింపులు లేకుండా పూర్తిగా వర్తిస్తాయి.

### ఆర్టికల్ - 5 : సమానత్వం, వివక్షత లేకపోవడం

1. వ్యక్తులందరూ చట్టం ముందు, చట్టం ప్రకారం సమానమని, ఎలాంటి వివక్ష లేకుండా అందరూ సమాన రక్షణ, ప్రయోజనానికి అర్హులని ప్రభుత్వాలు గుర్తించాలి.

2. వైకల్యం కారణంగా ఎలాంటి వివక్షతకు ఆస్కారం లేకుండా ప్రభుత్వాలు నిషేధిస్తు, వైకల్యం గల వ్యక్తులు వివక్షతకు గురికారని, అందరితో సమానంగా చట్టబద్ధ రక్షణ పొందుతారని హామీ ఇవ్వాలి.
3. సమానత్వాన్ని పెంపొందించి, వైకల్యం కారణంగా వివక్షతను రూపు మాపడం కోసం ప్రభుత్వాలు వైకల్యం గల వ్యక్తులకు తగిన ఆస్కారం కల్పించేలా చర్యలు తీసుకోవాలి.
4. వైకల్యం గల వ్యక్తులు వాస్తవికంగా సమానత్వాన్ని ఆస్వాదించడానికి అవసరమైన చర్యలు చేపట్టడాన్ని, ప్రోత్సహించడాన్ని ఈ ఒప్పందపు నిబంధనలకు విరుద్ధమైనవిగా చూడరాదు.

**ఆర్టికల్ - 6 : వైకల్యం గల మహిళలు**

1. వైకల్యం గల మహిళలు, బాలికలు అనేక రకాల వివక్షలకు గురవుతున్నారని ప్రభుత్వాలు గుర్తించాలి. ఈ దృష్ట్యా, వారు అన్ని మానవ హక్కులను, ప్రాథమిక స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అందరితో సమానంగా, పూర్తి స్థాయిలో ఆస్వాదించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలి.
2. ప్రస్తుత ఒప్పందంలో పొందుపరచిన అన్ని మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఉపయోగించుకోవడానికి హామీ ఇచ్చేలా ప్రభుత్వాలు ఈ మహిళల పూర్తి అభివృద్ధి, పురోగతి, సాధికారతకు అవసరమైన చర్యలన్నిటినీ చేపట్టాలి.

**ఆర్టికల్ - 7 : వైకల్యం గల బాలలు**

1. వైకల్యం గల బాలలు మిగిన సాధారణ బాలలతో సమానంగా అన్ని మానవ హక్కులను, ప్రాథమిక స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను ఆస్వాదించేలా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వాలు చేపట్టాలి.
2. వైకల్యం గల బాలలకు సంబంధించి చేపట్టే అన్ని కార్యక్రమాలలో బాలల అత్యున్నత ప్రయోజనం ప్రాథమిక లక్ష్యంగా ఉండాలి.
3. మిగిలిన బాలలందరితో సమానంగా వైకల్యం గల బాలలు తమపై ప్రభావం చూపే అన్ని అంశాలపైన స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను తెలిపేందుకు, వారి వయసు, పరిణతి ప్రకారం వారి అభిప్రాయాలకు విలువ లభించేందుకు

ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. వారివారి వైకల్యం, వారి వయసును బట్టి వారు ఆయా హక్కులను ఆస్వాదించడానికి అవసరమైన సహాయం అందించాలి.

**ఆర్టికల్ - 8 : అవగాహన-అభివృద్ధి**

1. ఈ క్రింది ముఖ్యమైన చర్యలు వెంటనే తీసుకోవడానికి ప్రభుత్వాలు హామీ ఇచ్చాయి.

(ఎ) వైకల్యం గల వ్యక్తులకు సంబంధించి కుటుంబంలోను, సమాజంలోను అవగాహనను పెంపొందించడం, వైకల్యం గల వ్యక్తుల గౌరవం, హుందా తనానికి గౌరవాన్ని సంతరించి పెట్టడం ;

(బి) వైకల్యం గల వ్యక్తులు జీవనంలోని అన్ని స్థానాలలో లింగం వయసుతో సహా, అన్ని రకాల దురభిప్రాయాలు, ఛాందస పద్ధతులు, ప్రమాదకర ఆచారాలను అరికట్టడం ;

(సి) వైకల్యం గల వ్యక్తులు అందించిన సేవలను, వారి సామర్థ్యాలను గురించి అవగాహన పెంపొందించడం.

**2. ఈ దిశగా తీసుకునే చర్యలు....**

(ఎ) ఈ దిగువ ప్రభావవంత కార్యక్రమాలను చేపట్టి, కొనసాగించాలి.

(i) వైకల్యం గల వ్యక్తుల హక్కులను ఆమోదించే సంస్కృతిని పెంపొందించడం.

(ii) వైకల్యం గల వ్యక్తుల పట్ల సానుకూల దృక్పథాలను, అత్యున్నత సామాజిక అవగాహనను ప్రోత్సహించడం.

(iii) వైకల్యం గల వ్యక్తుల ప్రతిభ, శక్తిసామర్థ్యాలు, నైపుణ్యాలను, వారు వారివారి పని ప్రదేశాలకు, శ్రామిక మార్కెటుకు అందించిన సేవలకు గుర్తింపును ప్రోత్సహించడం.

(బి) వైకల్యం గల వ్యక్తుల హక్కులకు ప్రజలందరిలో చిన్నతనం నుంచి గౌరవాన్ని పెంపొందించేలా విద్యా వ్యవస్థలోని ప్రతి దశలోను ఈ అంశాన్ని చేర్చడం.

(సి) ఈ ఒప్పందం ఆశయాలకు అనుగుణంగా వైకల్యం గల వ్యక్తులను చిత్రీకరించేలా అన్ని రూపాలలోని మీడియాను ప్రోత్సహించడం.

(డి) వైకల్యం గల వ్యక్తులు, వారి హక్కుల గురించి అవగాహన కల్పించే శిక్షణా కార్యక్రమాలను ప్రోత్సహించడం.

**ఆర్టికల్-9: అందుబాటు**

1. స్వతంత్రంగా జీవించేలా, జీవనంలోని అన్ని అంశాలలో భాగస్వామ్యం వహించేలా వైకల్యం గల వ్యక్తులను ప్రోత్సహించడం కోసం మిగిలిన అందరితో సమానంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలన్ని చోట్లా వీరు భౌతిక వాతావరణం, రవాణా, సమాచారం, సమాచార చేరవేత, ఐ.టి, సిస్టమ్స్, ఇతర అన్ని సదుపాయాలు, సేవలన్నిటినీ అందుకునేలా తగిన చర్యలన్నిటినీ ప్రభుత్వాలు తీసుకోవాలి. వారు ఈ సేవలు, సదుపాయాలన్నిటినీ అందుకోవడానికి అడ్డంకిగా, అవరోధంగా ఉన్న అన్ని అంశాలను గుర్తించి, నిరోధించడం తో సహా ఈ చర్యలన్నీ ఈ కింది అంశాలతో ఉండాలి.

(ఎ) భవనాలు, రోడ్లు, రవాణా, పాఠశాలలు, ఇళ్ళు, ఆస్పత్రుల వంటి పరిసరాలలోపలి, వెలుపలి సదుపాయాలు ;

(బి) సమాచారం, సమాచార చేరవేత, ఇతర సేవలు ఎలాక్ట్రానిక్ అత్యవసర సర్వీసులతో సహా.

**2. ప్రభుత్వాలు ఈకింది చర్యలు కూడా తీసుకోవాలి :**

(ఎ) ప్రజలందరికీ అందించడానికి ఉద్దేశించిన సదుపాయాలు, సేవలు అన్నిటినీ వైకల్యం గల వ్యక్తులు అందుకోవడానికి అవసరమైన కనీస ప్రమాణాలను, మార్గదర్శకాలను రూపొందించి, నిర్దేశించి, అమలును పర్యవేక్షించాలి.

(బి) ప్రైవేటు సంస్థల స్థలాలలో ప్రజలందరి కోసం ఉద్దేశించన సదుపాయాలు, సేవలను అందించే విషయంలో వైకల్యం గల వ్యక్తులకు ఈ సేవలు అందుబాటులో ఉండేందుకు అవసరమైన అన్ని కోణాలను దృష్టిలో ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలి.

(సి) సదుపాయాలు, సేవలు వినియోగించు కోవడంలో వైకల్యం గల వ్యక్తులు ఎదుర్కొనే సమస్యలపై ఈ రంగంలోని భాగస్వాములకు శిక్షణ నివ్వాలి.

(డి) భవనాలు, ఇతర ప్రజా సదుపాయాలలో బోర్డులపై బ్రెయిలీ భాషలోను, తేలికగా చదవగలిగే, అర్థమయ్యే భాషలోను రాయించాలి.

(ఇ) ప్రజలందరూ వెళ్ళదగిన భవనాలు, ప్రదేశాలలో గైడ్‌లు, రీడర్లు, గుర్తులతో కూడిన భాషను చదివి వివరించగల వారు, భాషా సహాయకులు వంటి ప్రత్యక్ష సహాయకులను ఏర్పాటు చేయాలి.

(ఎఫ్) వైకల్యం గల వ్యక్తులు సమాచారాన్ని తెలుసు కోవడానికి అవసరమైన తగిన ఇతర రూపాలలో సహయ ఏర్పాట్లు చేయాలి.

(జి) కొత్తగావచ్చే సమాచార, సాంకేతిక పరిజ్ఞానం, ఇంటర్నెట్, కంప్యూటర్ పరిజ్ఞానం వైకల్యం గల వ్యక్తులకు అందేలా చూడటం.

(హెచ్) వైకల్యం గల వ్యక్తులకు సమాచార, సాంకేతిక పరిజ్ఞానం, కంప్యూటర్లు తక్కువ ఖర్చులో అందు బాటులోకి వచ్చేలా ప్రాథమిక దశలోనే రూపకల్పన, అభివృద్ధి, ఉత్పత్తిని ప్రోత్సహించాలి.

**ఆర్టికల్ - 10 : జీవించే హక్కు**

ప్రతిమనిషికీ జీవించే హక్కు సహజసిద్ధంగా ఉన్నదని ప్రభుత్వాలు గుర్తించాలి. ఈ హక్కును మిగిలిన అందరితో సమానంగా వైకల్యం గల వ్యక్తులు ఆస్వాదించడానికి అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వాలు తీసుకోవాలి.

**ఆర్టికల్ - 11 : ప్రమాదకర పరిస్థితులు-మానవీయ అత్యవసర సందర్భాలు**

యుద్ధాలు, మానవీయ అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలతో సహా అన్ని ప్రమాదకర సందర్భాలలో వైకల్యం గల వ్యక్తులను రక్షించి, వారికి భద్రత కల్పించడం కోసం ఆయాదేశాలు అంతర్జాతీయ మానవీయ చట్టం, అంతర్జాతీయ మానవ హక్కుల చట్టంతో సహా అంతర్జాతీయ చట్టాలన్నిటి ప్రకారం తమపై ఉన్న బాధ్యతను అనుసరించి అన్ని చర్యలూ తీసుకోవాలి.

**ఆర్టికల్ - 12 : చట్టం ముందు సమాన గుర్తింపు**

1. వైకల్యంతో ఉన్న వ్యక్తులు ప్రతిచోటా చట్టం ముందు ఇతర వ్యక్తులతో సమానంగా గుర్తింపు పొందే హక్కు కలిగివున్నారని అన్ని దేశాలు పునరుద్ఘాటించాయి.
2. జీవితపు అన్ని అంశాలలోను వైకల్యం గల వ్యక్తులు మిగిలినవారితో సమానంగా చట్టబద్ధ స్థాయిని ఆస్వాదించే హక్కు వుందని దేశాలు గుర్తించాలి.
3. వైకల్యం గల వ్యక్తులు తమ చట్టబద్ధతను అమలు పరచడంలో అవసరమయ్యే తోడ్పాటు వారికి అందేందుకు అవసరమైన చర్యలను దేశాలు (ప్రభుత్వాలు) తీసుకోవాలి.
4. చట్టబద్ధస్థాయిని అమలు పరచడంలో వైకల్యం గల వ్యక్తులకు ఎలాంటి

అవరోధాలు, ఇబ్బందులు ఎదురు కాకుండ అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాన్ని అను సరించి ప్రభుత్వాలు అన్ని చర్యలూ తీసుకోవాలి. ఇలాంటి భద్రతా చర్యలు, వైకల్యం గల వ్యక్తి తన చట్టబద్ధస్థాయిని అమలు చేయటంలో ఆవ్యక్తి హక్కులకు, ఇష్టానికి, ప్రాధాన్యతలకు గౌరవం లభించేలా, ప్రయోజనాలకు భంగం కలిగించని విధంగా, ఎలాంటి వత్తిళ్ళు ప్రభావాలకు లోను కాకుండా, ఆవ్యక్తి పరిస్థితులకు తగిన విధంగా, తగిన దామాషాలో, సాధ్యమైనంత తక్కువ వ్యవధిలో జరిగి, తగిన స్థాయి స్వతంత్ర, నిష్పక్షపాత న్యాయస్థానం ఎప్పటికప్పుడు సమీక్షించేలా ఉండాలి. ఆయా చర్యలు సంబంధిత వ్యక్తి హక్కులకు, ప్రయోజనాలకు ఏ స్థాయిలో ప్రభావం చూపుతాయో, రక్షణలుకూడా అదే స్థాయి నిష్పత్తిలో ఉండాలి.

5. ఈ ఆర్టికల్ నిర్దేశాలకు లోబడి, వైకల్యం గల వ్యక్తులకు ఇతరులతో సమానంగా ఆస్తిహక్కు, తమ ఆర్థిక వ్యవహారాలను తాము నియంత్రించుకునే హక్కు, బ్యాంకు రుణాలు పొందే హక్కు, తాకట్టు, ఇతర, రుణ సదుపాయం పొందే హక్కులను కలిగి ఉండేలా, అలాగే వైకల్యం గల వ్యక్తులను ఏకపక్షంగా ఆస్తి నిరాకరణకు గురికానీయకుండా ప్రభుత్వాలు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి.

## ఆర్టికల్-13: న్యాయం అందుబాటు

1. కేసు పరిశోధన, ఇతర ప్రాథమిక స్థాయిల నుంచి చట్టపరమైన అన్ని ప్రక్రియలలో, సాక్షులుగా నిలవడంతో సహా, ప్రత్యక్షంగాను, పరోక్షంగాను చురుకుగా పాల్గొనడానికి ఆస్కారం కల్పించేలా వైకల్యం గల వ్యక్తుల కోసం వారి వయసుకి తగిన ప్రకారం ఆస్కారం కల్పిస్తూ ప్రభుత్వాలు వీరికి మిగిలిన వారితో సమానంగా న్యాయం, మరియు న్యాయవ్యవస్థను అందుబాటులో ఉంచే చర్యలు చేపట్టాలి.
2. వైకల్యం గల వ్యక్తులకు గుణాత్మక రీతిలో న్యాయం అందుబాటులో ఉంచడానికి వీలుగా ప్రభుత్వాలు న్యాయ వ్యవస్థలోని వారికి, పోలీసులకు, జైలుసిబ్బందికి శిక్షణ ఇవ్వాలి.

## ఆర్టికల్-14: వ్యక్తిస్వేచ్ఛ, భద్రత

1. వైకల్యం గల వ్యక్తులు మిగిలిన వారితో సమానంగా ...

(ఎ) వ్యక్తి స్వేచ్ఛ, భద్రతా హక్కును ఆస్వాదించేందుకు.

(బి) తమ స్వేచ్ఛా హక్కు ఏకపక్షంగా హరింపునకు గురికాకుండ, ఎలాంటి హక్కు భంగమైనా చట్టప్రకారం నిషేధితంగా, వైకల్యం ఉండటం ఎలాంటి హక్కు భంగానికి

సమర్థన కాకుండేలా చర్యలుతీసుకోవాలి.

2. వైకల్యం గల వ్యక్తులు ఎలాంటి ప్రక్రియ ద్వారానైనా తమ స్వేచ్ఛా హక్కు హరింపు బాధితులైతే, మిగిన అందరితో సమానంగా వారు అంతర్జాతీయ మానవ హక్కుల చట్టంప్రకారం అన్ని రకాల హామీలకు అర్హులయేలా, అలాగే ఈ ఒప్పందపు లక్ష్యాలు, అశయాలకు అనుగుణంగా హక్కులపరిక్షణ పొందేలా తగిన వసతి ఏర్పాటుతో సహా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

## ఆర్టికల్ - 15 : హింస, క్రూరమూ, అమానుషమూ, గౌరవ భంగం కలిగించే నిరాదరణ, శిక్షల నుంచి స్వేచ్ఛ

1. ఏ ఒక్క వ్యక్తీ హింసకు లేదా క్రూరమూ, అమానుషమూ, గౌరవ భంగం కలిగించే శిక్షలకు గురికారాదు, ప్రత్యేకించి, వారి స్వేచ్ఛాయుత ఆమోదం లేకుండా ఏ ఒక్కరిపైనా వైద్య, శాస్త్రీయ పరిశోధనలు జరగరాదు.
2. వైకల్యం గల వ్యక్తులు మిగతావారితో సమానంగా, ఎలాంటి హింస, క్రూరత్వం, అమానుషం లేదా, అగౌరవపరిచే ఆదరణ, శిక్షలకు గురి కాకుండ ప్రభుత్వాలు పటిష్ఠమైన చట్టరూప, పరిపాలనా పరమైన,న్యాయపరమైన చర్యలన్నీ తీసుకోవాలి.

## ఆర్టికల్ - 16 : దోపిడి, హింస, దుర్వినియోగం నుంచి స్వేచ్ఛ

1. వైకల్యం గల వ్యక్తులు, వారి లింగం (జెండర్) ఏదైనప్పటికీ, ఇంట్లోను, ఇంటి బయట ఎలాంటి దోపిడీకి, హింసకు, దుర్వినియోగానికి గురికాకుండా చూసేందుకు ప్రభుత్వాలు అవసరమైన చట్టరూప, పరిపాలనా పరమైన, సాంఘిక, విద్యా పరమైన, ఇతర చర్యలన్నీ తీసుకోవాలి.
2. వైకల్యం గల వ్యక్తులకు వారి లింగం (జెండర్) ఆధారంగా, వయసు ప్రకారం సహాయ, తోడ్పాటు కార్యక్రమాలను చేపట్టడం ద్వారా ప్రభుత్వాలు వారిని అన్నిరకాల దోపిడీ, హింస, దుర్వినియోగం నుంచి రక్షించాలి. దోపిడీ, హింస, దుర్వినియోగాలను గుర్తించడం, నిరోధించడం, సంబంధితులకి ఫిర్యాదు చేయడానికి సంబంధించిన మెళకువలపై వారికి, వారి కుటుంబ సభ్యులకి, సంరక్షకులకి శిక్షణ, సమాచారం ఇవ్వాలి. వీరి రక్షణ ఏర్పాట్లు వయసు, లింగం, వైకల్యం ప్రాతిపదికన ఉండేలా ప్రభుత్వాలు జాగ్రత్త తీసుకోవాలి.

3. హింస, దోపిడీ, దుర్వినియోగం వంటి హాని జరగడాన్ని నిరోధించడం కోసం ప్రభుత్వాలు వైకల్యం గల వ్యక్తుల కోసం రూపొందించిన అన్ని సదుపాయాలు, కార్యక్రమాల అమలును స్వతంత్ర వ్యవస్థలచే పట్టిష్ఠంగా పర్యవేక్షింప జేయాలి.

4. ఏ విధమైన దోపిడీ, దుర్వినియోగం, హింసకు గురైన వైకల్యం గల ఏవ్యక్తి అయినా, వారికి రక్షణ సేవలు అందించడంతో సహా వారు మానసికంగా, భౌతికంగా, వేగంగా కోలుకునేందుకు, పునరావాసం పొంది సమాజంలో తిరిగి కలిసి పోయేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వాలు చేపట్టాలి. ఇలాంటి కోలుకోవడానికి, సమాజంలో తిరగి కలవడానికి జరిగే కృషి ఆవ్యక్తి ఆరోగ్యం, సంక్షేమం, ఆత్మగౌరవం, హుందాతనం, స్వయం ప్రతిపత్తిని పరిరక్షించేదిగా ఉంటూ, లింగ, వయసు రీత్యావారి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి.

5. వైకల్యం గల వ్యక్తులపై జరిగే హింస, దోపిడీ, దుర్వినియోగాలను గుర్తించి, పరిశోధించి, అవసరమైనపుడు ప్రాసిక్యూట్ చేయడానికి ఉపకరించేలా వైకల్యం గల వ్యక్తుల పట్ల, ప్రత్యేకించి మహిళలు, బాలికల పట్ల జరిగే అన్ని రకాల అఘాయిత్యాలపై పట్టిష్ఠమైన చట్టాలను ప్రభుత్వాలు అమలులోకి తేవాలి.

## ఆర్టికల్-17: వ్యక్తి సచ్ఛీలతకు రక్షణ

వైకల్యం గల ప్రతి వ్యక్తీ, మిగిలిన అందరతో సమానంగా తన భౌతిక, మానసిక సచ్ఛీలతకు రక్షణ హక్కు కలిగివున్నారు.

## ఆర్టికల్-18: జాతీయత, ఎక్కడికైనా వెళ్ళేస్వేచ్ఛ

1. వైకల్యం గల వ్యక్తులు, మిగిలిన వారితో సమానంగా ఎక్కడికైనా వెళ్ళే స్వేచ్ఛ కలిగివున్నారని, వారి నివాసాన్ని, జాతీయతను ఎంచుకునే హక్కును కలిగివున్నారని సభ్యప్రభుత్వాలు గుర్తిస్తున్నాయి. వైకల్యం గల వ్యక్తులకు...

(ఎ) జాతీయతను పొందే హక్కు, మార్చుకునే హక్కు, వారివైకల్యం కారణంగా, ఏకపక్షంగా జాతీయతను కోల్పోవడానికి అవకాశంలేదని,

(బి) వారు తమ జాతీయత, లేదా మరే ఇతర గుర్తింపు పత్రాలు సంపాదించుకుని, ఉపయోగించుకోవడానికి వైకల్యం అడ్డంకి కాదని, ఇమ్మిగ్రేషన్ (విదేశాలకు వలస) వంటి ప్రక్రియలకు వైకల్యం అడ్డంగా చూపేవీలులేదని,

(సి) వారు తమ సొంత దేశంతో సహా ఏదేశాన్ని అయినా విడిచి వెళ్ళవచ్చుని.

(డి) వైకల్యం గల కారణంగా తమ సొంత దేశంలో ప్రవేశించే హక్కుకు భంగం కలగరాదని, సభ్యదేశాలు హామీ ఇస్తున్నాయి.

2. వైకల్యంతో పుట్టిన పిల్లలకు పుట్టినప్పటి నుంచే పేరు హక్కు, జాతీయతను ఎంచుకునే హక్కు, సాధ్యమైనంతవరకు తమ తల్లిదండ్రుల గురించి తెలుసుకుని, వారి సంరక్షలో పెరిగే హక్కు కలిగివున్నారు.

## ఆర్టికల్ -19 : స్వతంత్రంగా బ్రతికే, సమాజంలో భాగస్వామి అయ్యే హక్కు

వైకల్యం గల వ్యక్తులందరూ మిగిలిన అందరితో సమానంగా తమ ఇష్టానుసారం సమాజంలో భాగమై జీవించేందుకు, వారు పూర్తి స్థాయిలో తమ హక్కును వినియోగించుకుంటూ సమాజంలో పూర్తిగా భాగమయ్యేందుకు, హక్కు ఉందని ఈ ఒప్పందంలో భాగస్వాములైన దేశాలు అంగీకరించాయి. వారికి ఈ క్రింది హామీలు కూడా ఇచ్చాయి...

(ఎ) వైకల్యం గల వ్యక్తులు తాము ఎక్కడ, ఎవరితో కలసి జీవించాలనుకుంటున్నారో ఎంచుకునే హక్కు ఉంది, ఒక నిర్దిష్ట ఏర్పాటులో (వాతావరణంలో) నివసించాలన్న, ఆంక్షలేమీ వారిపైలేవు.

(బి) వైకల్యం గల వ్యక్తులు ఇంటిలో, ఇతర సామాజిక ప్రదేశాలలో ఎక్కడైనా ఉండే వీలువుంది, వారి జీవనానికి, సమాజంలో కలవడానికి అవసరమైన వ్యక్తిగత సహాయం లభిస్తుంది, సమాజం (లేదా సమూహం) నుంచి వేరు (దూరం) చేయడానికి వీలు లేదు.

(సి) సాధరణ ప్రజలకు లభించే సామాజిక సేవలు, సదుపాయాలు, వైకల్యం గల వ్యక్తులకు కూడా సమానత్వప్రాతిపదికన , వీరి అవసరాలకు అయా సేవలు, సదుపాయాలు లభిస్తాయి.

## ఆర్టికల్ -20 : వ్యక్తిగత చలనం

ఈ ఒప్పందంలో భాగస్వామ్యదేశాలు, వైకల్యం గల వ్యక్తులు సాధ్యమైనంత వరకు స్వతంత్రంగా కదిలే అవకాశాన్ని కల్పించేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలి. ఇందులో...

(ఎ) వైకల్యం గల వ్యక్తులు వారికి ఇష్టమైన రీతిలో, ఇష్టమైన వేళకు, తమశక్తికి అందుబాటులో ఉండే వ్యయంలో కదిలేందుకు వీలు కల్పించే ఏర్పాటు.

(బి) వైకల్యం గల వ్యక్తులు కదిలేందుకు నాణ్యమైన సహాయక పరికరాలు, సహాయక టెక్నాలజీ, వ్యక్తుల సహాయం, సహాయకులు వంటి సదుపాయాలు వారికి అందుబాటు ధరలలో ఉంచడం.

(సి) వైకల్యం గల వ్యక్తులకు, వారితో కలసి పనిచేసే ప్రత్యేక సిబ్బందికి చలనపు మెళకువలపై శిక్షణ ఇవ్వడం.

(డి) వైకల్యం గల వ్యక్తుల చలనానికి దోహదం చేసే పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తయారు చేసే సంస్థలు అన్నిరకాల వైకల్యాలను పరిగణనలోకి తీసుకునేలా ప్రోత్సహించడం.

## ఆర్టికల్ - 21: భావప్రకటన, అభిప్రాయప్రకటన, స్వేచ్ఛ, సమాచారహక్కు

వైకల్యం గల వ్యక్తులు మిగిలిన అందరితో సమానంగా తమ భావాలను, అభిప్రాయాలను వ్యక్తంచేసే హక్కును వినియోగించుకునేలా, సమాచారాన్ని అడిగి తెలుసుకునే, ఇతరులకు చెప్పేలా, ఈ ఒప్పందంలోని ఆర్టికల్–2లో నిర్వచించిన విధంగా వారికి ఇష్టమైన సమాచార రూపంలో తెలుసుకునేలా/తెలిపేలా అవకాశం కల్పించేట్లు సభ్యదేశాలు తగిన చర్యలన్నీ తీసుకోవాలి. ఇంకా...

(ఎ) సాధారణ ప్రజలకోసం ఉద్దేశించిన సమాచారాన్ని ఆయావైకల్యాలకు తగిన రీతులలో వైకల్యం గల వ్యక్తులకు అదనపు ఖర్చులు లేకుండా అందజేయాలి.

(బి) అధికార వ్యవహారాలలో సైగల భాష, బ్రెయిలీ లిపి, ఇతర భాషలు, రూపాలలో ఆయా వైకల్యం గల వ్యక్తులకు సమాచారాన్ని అందించాలి.

(సి) ఇంటర్నెట్‌తో సహా సాధారణ ప్రజలకు వివిధ రకాల సేవలను అందించే ప్రైవేటు సంస్థలను వైకల్యం గల వ్యక్తులకు వెసులుబాటైన భాషలో, రూపంలో సేవలు అందించాలని కోరాలి.

(డి) ఇంటర్నెట్ సేవలందించే వారితో సహా మాస్ మీడియా తన సేవలను వైకల్యం గల వ్యక్తులకు అందుబాటులో ఉంచేలా ప్రోత్సహించాలి.

(ఇ) సైగల భాష (సైన్ లాంగ్వేజ్)ను గుర్తించి, ప్రోత్సహించాలి.

**ఆర్టికల్-22: వ్యక్తిగత జీవనానికి గౌరవం**

1. వైకల్యం గల ఏవ్యక్తి, ఆవ్యకి నివాసం లేదా జీవన ఏర్పాట్లతో సంబంధంలేకుండా, వ్యక్తి గత స్వేచ్ఛ (ప్రైవసీ) భంగపాటుకు గాని, చట్ట విరుద్ధంగా గాని, ఏక పక్షంగా గాని వారి కుటుంబం, ఇల్లు,ఇతర సమాచార రూపాలలో, లేదా ఎలాంటి దాడులకు, గౌరవ భంగానికి గురికారాదు. అలాంటి దాడులు, జోక్యాల నుంచి రక్షణపొందే హక్కు వైకల్యం గల వ్యక్తులకు ఉంది.
2. మిగిలిన అందరి వ్యక్తులతో సమానంగా వైకల్యంగల వ్యక్తుల వ్యక్తిగత, ఆరోగ్య, పునరావాస సమాచారాన్ని ప్రభుత్వాలు గోప్యంగా ఉంచాలి.

**ఆర్టికల్-23: ఇల్లు, కుటుంబానికి గౌరవం**

1. ఈ దిగువ విధంగా హామీ ఇచ్చేలా ప్రభుత్వాలు వైకల్యం గల వ్యక్తులపట్ల వివాహం, కుటుంబం, సంతానం కలిగివుండటం, సంబంధాలు (రిలేషన్‌షిప్స్) వంటి అన్ని అంశాలలో ఇతరులతో సమాన హక్కులు కలిగి వుండేలా, అన్ని రకాల వివక్షతను నిర్మూలించేలా పటిష్టవంతమూ, అర్థవంతమూ అయిన చర్యలు తీసుకోవాలి. ఇంకా...

(ఎ) వివాహ వయసున్న వైకల్యం గల వ్యక్తులందరూ జీవిత భాగస్వామి కాబోయే వ్యక్తి నుంచి స్వేచ్ఛాయుతమూ, సంపూర్ణమూ అయిన ఆమోదంతో పెళ్ళి చేసుకుని, కాపురం ఏర్పరచుకునే హక్కును కలిగి ఉన్నారు.

(బి) వైకల్యం గల వ్యక్తులు తమకు కావలసిన సంతానం సంఖ్య, వారి మధ్య దూరం గురించి బాధ్యతాయుతంగా స్వేచ్ఛగా నిర్ణయించుకునే హక్కును, వారి వయసుకు తగిన సమాచారాన్ని, పునరుత్పత్తి, కుటుంబ నియంత్రణ విద్యను అందుకునే హక్కు ఉందని, ఈ హక్కులను వినియోగించుకునేందుకు అవసరమైన పద్ధతులు, సహాయాలను పొందే హక్కు ఉంది.

(సి) వైకల్యం గల వ్యక్తులు తమ సంతానోత్పత్తిని ఇతరులతో సమానంగా ఉంచు కోవాలి.

2. సంరక్షకులుగా (గార్డియన్), పిల్లలుగా, వారసులుగా (ట్రస్టీలు), పిల్లలు లేదా ఈ కోవకు చెందిన సంస్థల దత్తత పరమైన అంశాలకు సంబంధించి (ఈ దృక్పథాలు అమలులో ఉన్న ఆయాదేశాల చట్టాలననుసరించి) వైకల్యం గల

వ్యక్తుల హక్కులు, బాధ్యతలను ప్రభుత్వాలు గుర్తించాలి. ఈ అన్ని సందర్భాలలోనూ బాలల అత్యుత్తమ ప్రయోజనం అంతిమ లక్ష్యంగా ఉండాలి. తమపిల్లల పెంపకం విషయంలో వైకల్యంగల వ్యక్తులకు ప్రభుత్వాలు సహాయమందించాలి.

3. కుటుంబ జీవనానికి సంబంధించి వైకల్యంగల వ్యక్తులకు ఇతరులతో సమాన హక్కులు ఉన్నాయని ప్రభుత్వాలు గుర్తించాలి. ఈ హక్కులను అమలు చేయడానికి, వైకల్యంగల బాలలను దాచి పెట్టడం, వదిలివేయడం, నిర్లక్ష్యంచేయడం, వేరు చేయడం వంటి వాటిని నివారించడం కోసం ప్రభుత్వాలు వైకల్యం గల బాలలకు, వారి తల్లిదండ్రులకు ముందుగానే సమగ్ర సమాచారాన్ని, సేవలను, తోడ్పాటును అందించాలి.

4. వైకల్యం గల బాలుడు/బాలిక అత్యుత్తమ ప్రయోజనం దృష్ట్యా వారిని వారి తల్లిదండ్రుల నుంచి వేరు చేయడం అవసరమని న్యాయస్థానం సమీక్షద్వారా నిర్ణయిస్తేతప్ప, పిల్లల ఇష్టానికి భిన్నంగా వారిని వారు తల్లిదండ్రుల నుంచి వేరు చేయకుండా ఆయాదేశాల ప్రభుత్వాలు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు గాని, లేక వారి తల్లిదండ్రులలో ఎవరోఒకరు లేదా ఇద్దరూ వైకల్యం కారణంగా పిల్లలను వారి తల్లిదండ్రులనుంచి ఎట్టిపరిస్థితిలోనూ దూరం చేయరాదు.

5. వైకల్యం గల వ్యక్తు లైన బాలుడి/బాలిక సంరక్షణను వారి కుటుంబం చేపట్టలేని పరిస్థితులలో ప్రభుత్వం ఈ బాలలకు విస్తృత కుటుంబ వాతావరణంలో, లేదా, అక్కడ కూడా సాధ్యం కాకపోతే కుటుంబ వాతావరణంతో నిండిన సమాజంలో (సమూహంలో) వారి పెంపకానికి ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.

**ఆర్టికల్-24:విద్య**

1. వైకల్యంతో ఉన్న వ్యక్తుల విద్యాహక్కును సభ్యదేశాలు గుర్తించాయి. ఎలాంటి వివక్ష లేకుండా, సమాన హక్కుల ప్రాతిపదికన వీరి విద్యా హక్కును అమలు చేయడం కోసం సభ్యదేశాలు అన్ని స్థాయిలలో విలీనవిద్య పద్ధతిని అమలు చేస్తూ ఈ క్రింది దిశగా జీవితకాలం అభ్యాసం కల్పించాలి....

(ఎ) మానవ శక్తి సంపూర్ణ అభివృద్ధి, గౌరవం, సొంతవిలువ, మానవహక్కులు, ప్రాథమిక స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, మానవ భిన్నత పట్ల గౌరవాన్ని పెంపొందించడం.

(బి) వైకల్యం గల వ్యక్తులు తమ శక్తిమేరకు తమ వ్యక్తిత్వాన్ని, నైపుణ్యాన్ని,

సృజనాత్మకతను, అలాగే తమ భౌతిక, మానసిక సామర్థ్యాలను పెంచుకోవడం.

(సి) ఒక స్వేచ్ఛా సమాజంలో వైకల్యం గల వ్యక్తులు సమర్థవంతంగా పాల్గొనడం.

2. ఈ హక్కును సాధించే క్రమంలో ఆయా దేశాలు ఈ కింది చర్యలు చేపట్టాలి...

(ఎ) వైకల్యం ప్రాతిపదికగా వైకల్యం గల వ్యక్తులను సాధారణ విద్యావ్యవస్థనుంచి మినహాయించరాదు, అలాగే వైకల్యం గల బాలలను వారి వైకల్యం కారణంగా ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్యనుంచి, సెకండరీ విద్యనుంచి మినహాయించరాదు.

(బి) వైకల్యం గల వ్యక్తులు, తాము నివసించే సమాజంలోని మిగిలిన వారితో సమానంగా నాణ్యమైన ఉచిత ప్రాథమిక, సెకండరీ విద్యను అందుకోవచ్చు.

(సి) ఆయా వ్యక్తుల వ్యక్తిగత అవసరాలకు తగిన ప్రాధాన్యత.

(డి) వైకల్యం గల వ్యక్తులకు సాధారణ విద్యావ్యవస్థ పరిధిలోనే వారికి పటిష్టమైన చదువును అందించేందుకు అవసరమైన తోడ్పాటును ఇవ్వాలి.

(ఇ) పూర్తిస్థాయి విలీనం లక్ష్యంగా విద్యాపరంగాను, సాంఘికంగాను అభివృద్ధిని మెరుగుపరిచే వాతావరణంలో వ్యక్తిగత తోడ్పాటు ఏర్పాట్లను కల్పించాలి.

3. చదువులో, సమాజంలో భాగంగా వారు పూర్తిగా మమేకమయ్యేలా, వైకల్యం గల వ్యక్తులకు జీవితం, సామాజిక అభివృద్ధి మెళకువలను ఆయాదేశాల ప్రభుత్వాలు నేర్పాలి. ఈ దిశగా ప్రభుత్వాలు ఈ క్రింది తరహా చర్యలు తీసుకోవాలి...

(ఎ) బ్రెయిలీ లిపి, ఇతర ప్రత్యామ్నాయ స్క్రిప్టులను నేర్చుకోవడానికి, సమాచారం తెలుసుకునే, తెలిపే ఇతర పద్ధతుల రూపాలు, కదలిక మెళకువలు వగైరా నేర్చుకునే ఆస్కారం కల్పిచడం, గురువులు, సహచరులను కల్పించడం.

(బి) సైగల భాషను నేర్చుకోవడానికి తోడ్పాటు నివ్వడం, వినికిడి లోపంగల వారకి భాషాగుర్తింపు (లింగ్విస్టిక్ ఐడెంటిటీ)ని ప్రోత్సహించడం.

(సి) చూపులోపం, వినికిడిలోపం గల వారు, వినికిడిలోపం, చూపులోపం రెండూ గల వ్యక్తులు, ప్రత్యేకించి పిల్లలకు విద్యాబోధన అత్యంతసానుకూల పద్ధతులలో, భాషలలో, మార్గాలలో వారి విద్యా, సాంఘిక అభివృద్ధికి తోడ్పడే వాతావరణంలో జరగాలి.

4. ఈ హక్కును అమలు చేయడంకోసం ఆయా దేశాలు ఉపాధ్యాయులను, ప్రత్యేకించి సైగల భాష, బ్రెయిలీలో శిక్షితులైన వైకల్యం గల ఉపాధ్యాయులను నియమించాలి, విద్యావిషయాలలో పనిచేసే వృత్తిదారులు, సిబ్బంది అందరికీ శిక్షణ ఇవ్వాలి. వైకల్యం గల వ్యక్తుల పట్ల అవగాహన, తగిన ప్రత్యామ్నాయ బోధనా పద్ధతులు, మెళకువలు, సమాచార సాధనాలు, విద్యా టెక్నిక్‌లను, వైకల్యం గల వ్యక్తులకు

బోధనలో ఉపకరించే పరికరాలను, విషయాలను గురించి ఇలాంటి శిక్షణలో పొందుపరచాలి.

5. వైకల్యం గల వ్యక్తులకు సాధారణ తృతీయ విద్య, వృత్తి విద్యా శిక్షణ, వయోజనవిద్య, ఎలాంటి వివక్ష లేకుండా మిగిలిన వారితో సమానంగా జీవితకాలం నేర్చుకునే అవకాశం కలిగేలా ఆయా ప్రభుత్వాలు హామీ ఇవ్వాలి. ఈ దిశగా, వైకల్యం గల వ్యక్తులకు తగిన ఆస్కారం కలిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

**ఆర్టికల్ - 25 : ఆరోగ్యం**

వైకల్యం గల వ్యక్తులు తమ వైకల్యం కారణంగా ఎలాంటి వివక్షతకు గురికాకుండా మిగిలిన అందరితో సమానంగా అత్యున్నత ప్రమాణం వరకు ఆరోగ్యపు హక్కును ఆస్వాదించే హక్కును కలిగివున్నారని సభ్యదేశాలు గుర్తించాయి. ఆరోగ్యపరమైన పునరావాసంతో సహా జెండర్–సెన్సిటివ్‌గా ఉండే అన్ని ఆరోగ్యసేవలను వైకల్యం గల వ్యక్తులకు అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వాలు తగిన అన్ని ఏర్పాట్లు చేయాలి. ప్రత్యేకించి ప్రభుత్వాలు ఈ క్రింది విధంగా చేయాలి.

(ఎ) ఇతరులందరికీ అందించే మాదిరిగా వైకల్యం గల వ్యక్తులకు అదే స్థాయిలో, నాణ్యతతో, ప్రమాణాలతో కూడిన వైద్య సంరక్షణ కార్యక్రమాలను ఉచితంగా గాని లేక అందుబాటు ధరలకు గాని అందించాలి. లైంగిక, పునరుత్పత్తి, ఆరోగ్యం, జనాభా ప్రాతిపదికగా ఉండే ప్రజారోగ్య కార్యక్రమాలు కూడా ఇందులో భాగంగా ఉండాలి.

(బి) వైకల్యం గల వ్యక్తులకు వారివారి వైకల్యాలను బట్టి ప్రత్యేకంగా అవసరమైన ముందస్తు గుర్తింపు, నివారణ, వైకల్యం తగ్గింపు, మరింత వైకల్యం రాకుండా నిరోధించడం వగైరా వైద్య సేవలను పిల్లలు, వృద్ధులతో సహా అందరికీ అందించాలి.

(సి) ఈ వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాలతో సహా, ప్రజలకు వారికి అత్యంత చేరువలో అందించాలి.

(డి) సాధారణ ప్రజలకి,వైకల్యం గల వారికి ఒకే నాణ్యతతో కూడిన వైద్యసేవలు అందించడానికి వైద్య వృత్తిదారులు కావాలి. వైద్యం ఉచితంగాను, వారి స్వేచ్ఛాయుత ఆమోదంతోను ఆమోదించాలి, మానవ హక్కులు, గౌరవం, స్వయం

ప్రతిపత్తి, వైకల్యం గల వ్యక్తుల అవసరాలు వంటివాటిపై ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్య రంగంలోని వారికి శిక్షణ, నైతిక ప్రమాణాల నిర్దేశం ద్వారా అవగాహన పెంచాలి.

(ఇ) జాతీయ చట్టం ద్వారా ఆరోగ్య, జీవిత బీమా సదుపాయం ఉన్న దేశాలలో ఆరోగ్యబీమా కల్పించడంలో వైకల్యం గల వారి పట్ల వివక్షతను నిషేధించాలి. నిష్పక్షపాతమూ, సజావు అయిన పద్ధతిలో బీమాసదుపాయాన్ని అందించాలి.

(ఎఫ్) వైకల్యం కారణంగా ఆరోగ్య సంరక్షణ, ఆరోగ్య సేవలు, ఆహారం, ద్రవ పదార్థాలను నిరాకరించే వివక్షతను నివారించాలి.

## ఆర్టికల్ - 26 : అలవడటం, పునరావాసం

1. వైకల్యం గల వ్యక్తులు గరిష్ఠస్థాయిలో స్వతంత్రతను సంతరించుకుని, కొనసాగించేలా, సంపూర్ణ భౌతిక, మానసిక, సాంఘిక, వృత్తి సామర్థ్యాలను సంతరించుకుని, జీవితపు అన్ని అంశాలలో సమ్మిళితం, పూర్తి భాగస్వామ్యం అయ్యేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను, సహచరుల సహకారం కూడా కలిపి, ప్రభుత్వాలు చేయాలి. ఇందుకొసం ప్రభుత్వాలు అలవాటు, పునరావాస సేవలు, కార్యక్రమాలు, ప్రత్యేకించి ఆరోగ్యం, ఉపాధి, విద్య, సామాజిక సేవల రంగాలలో నిర్వహించడం, పటిష్ట పరచడం ద్వారా ఈ క్రింది సేవలు, కార్యక్రమాలు చేపట్టాలి...

(ఎ) సాధ్యమైనంత చిన్నతనంలోనే ప్రారంభమైవారి వ్యక్తిగత అవసరాలు, శక్తి సామర్థ్యాలను అంచనా వేయడంపై ఆధారపడాలి.

(బి) సమాజంలో అన్ని విధాలుగా భాగస్వాములయ్యేలా, కలసిపోయేలా చేయడానికి తోడ్పడాలి. స్వచ్ఛందమైనవైవుండాలి, వైకల్యంగల వ్యక్తులకి అతిసమీపంలో–గ్రామీణ ప్రాంతాలతో సహా అందుబాటులో ఉండాలి.

2. వైకల్యం గల వ్యక్తుల పునరావాస సేవల రంగంలో పని చేసే వారికి ప్రభుత్వాలు ప్రారంభంలో శిక్షణన్విడం, దీనిని కొనసాగించడం, అభివృద్ధి పరచడం, ప్రోత్సహించడం చేయాలి.

3. వైకల్యం గల వ్యక్తుల పునరావాసం కోసం ఉద్దేశించిన సహాయ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం అందు బాటును, అవగాహనను, వినియోగాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహించాలి.

**ఆర్టికల్-27: పని, ఉపాధి**

1. ఇతరులతో సమానంగా వైకల్యం గల వ్యక్తులకు పని చేసే హక్కు ఉందని సభ్యదేశాలు గుర్తించాయి ; సొంతంగా ఎంపిక చేసుకున్న, లేదా శ్రామిక మార్కెట్‌లో ఆమోదం పొందిన పని చేయడం ద్వారా జీవనం సాగించే అవకాశపు హక్కు, అలాగే వైకల్యం గల వ్యక్తులకి అనువైన, అందుబాటైన పనివాతావరణం ఇందులో భాగం. వైకల్యం గల వ్యక్తులు, పని చేస్తుండగా వైకల్యం పొందిన వారి పని హక్కును ప్రభుత్వాలు గుర్తించాయి. ఇందుకోసం చట్టాలు చేయడంతో సహా అనేక చర్యలు తీసుకోవడం.... అంటే..

(ఎ) అన్నిరకాల ఉపాధి అవకాశాలకు సంబంధించిన అన్ని అంశాలలో-ఉద్యోగంలో నియామాకానికి షరతులు, ఉపాధికల్పన, ఉద్యోగం కొనసాగింపు పదోన్నతులు, భద్రత, ఆరోగ్య వంతమైన పని ప్రమాణాలతో సహా-వైకల్యం ప్రాతిపదికన వివక్షతను నిషేధించాలి.

(బి) సమానావకాశాలు, సమానపనికి సమానవేతనం, భద్రత, ఆరోగ్యవంతమైన పని ప్రమాణాలు, వేధింపుల నుంచి రక్షణ, సమస్యల పరిష్కారం తో సహా న్యాయమూ, సానుకూలమైన పని ప్రమాణాల విషయంలో వైకల్యం గల వ్యక్తులకు మిగిలిన అందరు వ్యక్తులతో సమాన హక్కులు ఉండేలా ప్రభుత్వాలు పరిరక్షించాలి.

(సి) వైకల్యం గల వ్యకులు, మిగిలిన వ్యక్తులతో సమానంగ, కార్మిక, ట్రేడ్ యూనియన్ హక్కులను వినియోగించుకునేందుకు హామీ ఇవ్వాలి.

(డి) వైకల్యం గల వ్యక్తులకు సాధారణ, సాంకేతిక, వృత్తిపరమైన మార్గదర్శక కార్యక్రమాలు అందుబాటులో ఉండేట్లు, ఉద్యోగాలలో నియామకం, నిరంతర వృత్తి విద్యా శిక్షణ ఉండేట్లు చేయాలి.

(ఇ) శ్రామిక మార్కెట్‌లో వైకల్యం గల వ్యక్తులకి ఉపాధి అవకాశాలు, ఎదుగుదల అవకాశాలు, అలాగే ఉపాధి అవకాశాలను గుర్తించి అందుకుని, కొనసాగించేందుకు, తిరిగి ఉద్యోగంలోకి వచ్చేందుకు అవకాశాలను, ప్రోత్సాహాన్ని అందించాలి.

(ఎఫ్) స్వయం ఉపాధి అవకాశాలను, సొంతంగా వ్యాపారాలు స్థాపించే ఔత్సాహికతను, సహకార సంఘాలు, సొంత వ్యాపారాలను ప్రోత్సహించాలి.

(జి) వైకల్యం గల వ్యక్తులకు ప్రభుత్వరంగంలో ఉపాధి కల్పించడం.

(హెచ్) ప్రైవేట్ రంగంలో వైకల్యం గల వ్యక్తులకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ఆయా సంస్థలకు ప్రోత్సాహకాలు, సానుకూల కార్యక్రమాలను ప్రోత్సహించాలి.

(ఐ) పని ప్రదేశంలో వైకల్యం గల వ్యక్తులకు సముచితస్థానం కల్పించాలి.

(జె) బహిరంగ శ్రామిక మార్కెట్‌లో వైకల్యం గల వ్యక్తులు పని అనుభవాన్ని సంపాదించుకోవడాన్ని ప్రోత్సహించాలి.

(కె) వైకల్యం గల వ్యక్తులకు వృత్తిపరమైన పునరావాసం, ఉద్యోగంలో నిలుపుదల, తిరిగి పనిలో చేరడం వంటి కార్యక్రమాలను ప్రోత్సహించాలి.

2. వైకల్యం గల వ్యక్తులు బానిసత్వంలో చిక్కుకోకుండాను, మిగిలిన వారితో సమానంగా బలవంతపు చాకిరి నుంచి రక్షణ పొందే చర్యలు ప్రభుత్వం తీసుకోవాలి.

## ఆర్టికల్ - 28 : ఉన్నత జీవన ప్రమాణాలు, సాంఘిక భద్రత

1. వైకల్యం గల వ్యక్తులు, వారి కుటుంబ సభ్యులకు తగినంత ఆహారం, దుస్తులు, ఇల్లుతో సహా ఉన్నత ప్రామాణాలతో కూడిన జీవనపు హక్కు ఉందని సభ్యదేశాలు గుర్తించాయి. వారు తమ జీవన ప్రమాణాల నిరంతర అభివృద్ధి హక్కునూ కలిగివున్నారు, వైకల్యం కారణంగా వారు ఈ హక్కును కోల్పోకుండ, దీనికి రక్షణ కల్పిస్తూ మరింత పటిష్టపరచాలి.

2. వైకల్యం గల వ్యక్తులకు సామాజిక భద్రత హక్కు ఉందని, వైకల్యం కారణంగా ఈ హక్కుకు భంగంకలగరాదని సభ్యదేశాలు గుర్తించాయి. ఈ హక్కును అమలు పరిచేందుకు, ఈక్రింది చర్యలతో సహా అవసరమైన అన్ని చర్యలనూ ప్రభుత్వాలు తీసుకోవాలి.

(ఎ) వైకల్యం గల వ్యక్తులకు స్వచ్ఛమైన నీరు అందేలా ఏర్పాటు చేయాలి, అలాగే, వైకల్యానికి సంబంధించిన అవసరాలకు తోడ్పడే పరికరాలు, తగిన సేవలు అందుబాటులో ఉంచాలి.

(బి) వైకల్యం గల వ్యక్తులకు, ప్రత్యేకించి వైకల్యం గల మహిళలు, బాలికలు, వృద్ధులకు సాంఘిక భద్రత, పేదరికనిర్మూలన కార్యక్రమాలను అందుబాటులో ఉంచాలి.

(సి) పేదరికంలో ఉన్న వైకల్యం గల వ్యక్తులు, వారి కుటుంబాలకు తగిన శిక్షణ కౌన్సిలింగ్, ఆర్థిక సహాయం, విశ్రాంత సంరక్షణతో తో సహా ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయం వైకల్య సంబంధ వ్యయంతో అందుబాటులో ఉంచాలి.

(డి) వైకల్యం గల వ్యక్తులకు ప్రభుత్వ గృహ పథకాలను అందు బాటులో ఉంచాలి.

(ఇ) వైకల్యం గల వ్యక్తులకు ఇతరలతో సమానంగా పదవీ విరమణ ప్రయోజనాలు, కార్యక్రమాలను వర్తింపజేయాలి.

**ఆర్టికల్ - 29 : రాజకీయ, ప్రజా జీవనంలో భాగస్వామ్యం**

వైకల్యం గల వ్యక్తుల రాజకీయ హక్కులను, వీటిని మిగిలిన అందరితో సమానంగా ఆస్వాదించే అవకాశాన్ని ప్రభుత్వాలు కల్పించాలి. దీనితోపాటు...

(ఎ) వైకల్యం గల వ్యక్తులు మిగిలిన వారితో సమానంగా స్వయంగా గాని లేక తమ ఇష్టానుసారం ఎన్నుకున్న ప్రతినిధి ద్వారా గాని రాజకీయ, ప్రజా జీవనంలో పూర్తిస్థాయిలో, చురుకైన పాత్రపోషించడం, అలాగే పోటీచేసే, ఓటువేసే హక్కు వినియోగించు కోవడానికి ఆస్కారం కల్పించేందుకు...

(i) ఓటువేసే పద్ధతులు, సదుపాయాలు, ఓటింగ్ సామగ్రి అన్నీ వైకల్యం గల వ్యక్తులకు వీలుగా, అందుబాటులో ఉండేలా, సులభంగా అర్థమయ్యేలా ఉంచాలి.

(ii) ఎన్నికలు, రెఫరండమ్ సందర్భాలల్లో ఎలాంటి వత్తిడులు లేకుండా స్వేచ్ఛగా రహస్య ఓటు ( సీక్రెట్ బ్యాలెట్) ద్వారా ఓటువేసే హక్కును పరిరక్షించడం, ఎన్నికలలో నిలబడి ప్రభుత్వంలో అన్ని స్థాయిలలో బాధ్యతలు చేపట్టి నిర్వహించేలా, అవసరమైన, అనుకూలమైన చోట్ల సహాయక, ఆధునిక పరిజ్ఞానాలను ఉపయోగించుకునేలా చేయాలి.

(iii) వైకల్యం గల వ్యక్తులు ఓటర్లుగా తమ ఇష్టాన్ని స్వేచ్ఛగా వ్యక్తం చేసేందుకు, ఇందుకు అవసరమైతే వీరు ఓటువేసే సందర్భంలో తమకి ఇష్టమైన వ్యక్తులను సహాయకులుగా నియమించుకునేందుకు హామీ ఇవ్వాలి.

(బి) ప్రజా కార్యక్రమాలలో, ఎలాంటి వివక్షలేకుండా మిగిలిన అందరితో సమానంగా చురుకుగా పాల్గొనేందుకు అనువైన వాతావరణాన్ని పెంపొందించాలి, ప్రజాకార్యక్రమాలలో పాల్గొనేలా వారిని ప్రోత్సహించాలి. ఇందులో భాగంగా...

(i) దేశ ప్రజల, రాజకీయ జీవితంతో సంబంధం ఉన్న సంఘాలు, స్వచ్ఛంద సంస్థలలో పాల్గొనేలా, అలాగే రాజకీయ పార్టీల కార్యక్రమాలు, నిర్వహణలో పాల్గొనేలా ప్రోత్సహించాలి.

(ii) స్థానిక, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో వైకల్యం గల వ్యక్తులకు

ప్రాతినిధ్యం వహించడం కోసం వైకల్యం గల వ్యక్తుల సంఘాలు, సంస్థల ఏర్పాటును ప్రోత్సహించాలి.

## ఆర్టికల్-30: సాంస్కృతిక జీవనం, వినోద, విరామ, క్రీడా కార్యక్రమాలలో పాల్గొనడం

1. సాంస్కృతిక జీవనంలో మిగిలిన వారితో సమానంగా పాల్గొనే హక్కు వైకల్యం గల వ్యక్తులకు ఉందని సభ్యదేశాలు గుర్తించాయి. వైకల్యం గల వ్యక్తులు ఈ కింది హక్కులను ఆస్వాదించడానికి అవసరమైన చర్యలను ప్రభుత్వాలు తీసుకోవాలి...

(ఎ) సాంస్కృతిక వస్తువులను తమకు వీలైన రూపాలలో అందుకోవడం.

(బి) టెలివిజన్ కార్యక్రమాలు, సినిమాలు, థియేటర్, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను తమకు వీలైన రూపాలలో ఆస్వాదించడం.

(సి) థియేటర్లు, మ్యూజియంలు, సినిమాలు, లైబ్రరీలు, పర్యాటక సేవలు వంటి సాంస్కృతిక ప్రదర్శనల, సేవల ప్రదేశాలకు వెళ్ళే వెసులుబాటు, అలాగే సాధ్యమైనమేరకు జాతీయ సాంస్కృతిక ప్రాధాన్యం ఉన్న ప్రదేశాలు, కట్టడాలకు వెళ్ళే ఆస్కారం.

2. వైకల్యం గల వ్యక్తులు తమ సృజనాత్మక, కళాత్మక, మేధో సంపత్తిని వారి సొంతానికే కాక సమాజం కోసం కూడా వినియోగించేలా అభివృద్ధి పరచుకునేందుకు, ఆచరణలో పెట్టేందుకు తగిన చర్యలను ప్రభుత్వాలు తీసుకోవాలి.

3. ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ వైకల్యం గల వ్యక్తులకు సాంస్కృతిక వస్తువుల అందుబాటు నిరోధించడానికి వీలు లేకుండా అంతర్జాతీయ చట్టాన్ని అనుసరించి ఆయాదేశాలు తగిన చర్యలు తీసుకోవాలి.

4. వైకల్యం గల వ్యక్తులు, మిగిలిన వ్యక్తులతో సమాన ప్రాతిపదికన, భాష, వినికిడిలోపం సంస్కృతితో (డెఫ్‌కల్చర్) సహా సొంత సాంస్కృతిక, భాషా గుర్తింపు, తోడ్పాటు హక్కును కలిగివున్నారు.

5. వినోదం, విశ్రాంతి, క్రీడా కార్యకలాపాలలో మిగిలిన వారితో సమానంగా వైకల్యం గల వ్యక్తులు భాగస్వామ్యం కావడానికి దోహదం చేసేందుకు ప్రభుత్వాలు ఈ క్రింది చర్యలు తీసుకోవాలి.

(ఎ) ప్రధాన ప్రవంతి క్రీడా కార్యక్రమాలలో వైకల్యం గల వ్యక్తులు సాధ్యమైనంత ఎక్కువమేరకు పాలు పంచుకునేలా ప్రోత్సహించాలి.

(బి) ఆయావైకల్యాలకు అనువైన క్రీడా కార్యక్రమాలను, వినోద కార్యక్రమాలను రూపొందించుకుని, అభివృద్ధి చేసుకుని, భాగస్వామ్యం వహించడానికి ప్రోత్సాహం అందించాలి, ఇందుకోసం మిగిలిన వారితో సమానంగా శిక్షణ, వనరులను వీరకి అందించాలి.

(సి) వైకల్యం గల వ్యక్తులకు క్రీడా, పర్యాటక, వినోద, విహార ప్రదేశాలలో ప్రవేశం ఉండాలి.

(డి) బడిలోని క్రీడా, వినోద కార్యక్రమాలతో పాటు వెలుపల కూడా ఆటలు, వినోదం, విహారం, క్రీడా కార్యక్రమాలలో మిగిలిన పిల్లలతో సమానంగా వైకల్యం గల బాలలకు అవకాశం, ప్రోత్సాహం అందించాలి.

(ఇ) వినోద, విహార, పర్యాటక, క్రీడా కార్యక్రమాలను నిర్వహించే వారి సేవలను వైకల్యం గల వ్యక్తులకు అందుబాటులో ఉంచాలి.

**ఆర్టికల్ - 31: గణాంకాలు డేటా సేకరణ**

1. ప్రస్తుత ఒప్పందాన్ని అమలులోకి తేవడానికి విధానాలను రూపొందించి అమలు చేయడానికి వీలుగా గణాంకాలు, పరిశోధనాడేటాతో సహా అవసరమైన సమాచార మంతటినీ సేకరించే బాధ్యతను సభ్యదేశాలు తీసుకున్నాయి. ఈ సమాచారసేకరణ, నిర్వహణ...

(ఎ) వైకల్యం గల వ్యక్తుల ప్రైవసీకి గౌరవం, గోప్యతలభించేలా డేటా పరిరక్షణకు చట్టాలతో సహా చట్టబద్ధంగా ఏర్పరచిన భద్రతకు అనుగుణంగా ఉండాలి.

(బి) గణాంకాల సేకరణ, వినియోగం అంతర్జాతీయంగా ఆమోదంపొందిన మానవ హక్కుల పరిరక్షణ, మౌలిక స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, నీతిసూత్రాలకు సరితూగాలి.

2. ఈ ఆర్టికల్ ప్రకారం సేకరించిన సమాచారాన్ని, తగిన విధంగా వికేంద్రీకరించి, ప్రస్తుత ఒప్పందంలోని బాధ్యతలు ఆయాదేశాలలో అమలవుతున్న తీరును అంచనా వేయాడానికి, వైకల్యం గల వ్యక్తులు తమ హక్కులను వినియోగించు కోవడంలో ఎదుర్కొంటున్న అడ్డంకులను గుర్తించి, వాటిని పరిష్కరించడానికి ఉపయోగించాలి.

3. ఈగణాంకాలు దిగువస్థాయి వరకు వెళ్లి, వైకల్యం గల వ్యక్తులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలి.

**ఆర్టికల్ - 32: అంతర్జాతీయ సహకారం**

1. ఈ ఒప్పందపు లక్ష్యాన్ని, ఉద్దేశాన్ని సాధించడంలో జాతీయ స్థాయి కృషికి అంతర్జాతీయ సహకారం, ప్రోత్సాహం ప్రాముఖ్యతను సభ్య దేశాలు గుర్తించాయి, ఈ దిశగా వివిధ దేశాల మధ్య, అవసరాన్ని బట్టి సంబంధిత ఆంతర్జాతీయ, ప్రాంతీయ సంస్థలు, ప్రజాసంఘాలు, ప్రత్యేకించి వైకల్యం గల వ్యక్తుల సంస్థల మధ్య అవసరమైన చర్యలు తీసుకుంటాయి. ఈ చర్యలలో ఈ క్రింద ఉదహరించినవి కూడా ఉంటాయి...

(ఎ) అంతర్జాతీయ అభివృద్ధి కార్యక్రమాలతో సహా అంతర్జాతీయ సహకారంలో వైకల్యం గల వ్యక్తుల అంశంతో పాటు, వారికి సహకారం కూడ అందుబాటులో ఉండేట్లు...

(బి) సమాచారం, అనుభవాలు, శిక్షణ కార్యక్రమాలు, ఉత్తమ పద్ధతులను పంచుకోవడం, ఇచ్చిపుచ్చుకోవడంతో సహా సామర్థ్యాల పెంపుకి ఆస్కారం కల్పించడం, తోడ్పాటు అందించడం.

(సి) పరిశోధన, శాస్త్రీయ, సాంకేతి పరిజ్ఞానాన్ని అందుబాటులో ఉంచేందుకు సహకారం అందించడం.

(డి) సహాయక సాంకేతిక పరిజ్ఞానం, సాంకేతిక బదలాయింపు ఇచ్చిపుచ్చుకోవడం, అందుబాటులో ఉంచడంతో సహా తగిన సాంకేతిక, ఆర్థిక సహాయం కల్పించడం.

2. ఈ ఆర్టికల్‌లోని అంశాలకు, ప్రస్తుత ఒప్పందం ప్రకారం ప్రభుత్వాలు నిర్వర్తించ వలసి వున్న బాధ్యతలకు ప్రమేయంలేదు.

**ఆర్టికల్ - 33: జాతీయ అమలు, పర్యవేక్షణ**

1. ఆయాదేశాలు తమ వ్యవస్థాగత పరిధులలో ప్రస్తుత ఒప్పందం అమలుకి సంబంధించిన అంశాల కోసం ప్రభుత్వంలో ఒకటి లేదా ఎక్కువ ప్రధాన కేంద్రాలను ఏర్పాటు చేయాలి. వివిధ రంగాలలో వివిధ స్థాయిలలో తీసుకునే చర్యలను సమన్వయ పరచడం కోసం సమన్వయ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం లేదా కేటాయించడానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలి.

2. ప్రస్తుత ఒప్పందం అమలును ప్రోత్సహించడం, పరిరక్షించడం, పర్యవేక్షించడం కోసం ఆయా దేశాలు తమతమ చట్ట, న్యాయపరమైన పద్ధతులకు లోబడి ఒకటి

లేదా ఎక్కువ స్వతంత్ర వ్యవస్థలతో సహా ఒక వ్యవస్థాగత ఏర్పాటును రూపొందించి, నిర్వహించి, బలోపేతం చేయాలి. ఇలావ్యవస్థలను ఏర్పాటు చేసేటపుడు ప్రభుత్వాలు, మానవ హక్కుల పరిరక్షణ, మెరుగుదలకోసం జాతీయ సంస్థలు పని చేస్తున్న స్థితికి సంబంధించిన సూత్రాలను పరిగణనలోకి తీసుకోవాలి.

3. ఈ పర్యవేక్షణ ప్రక్రియలో పౌరసంఘాలు, ప్రత్యేకించి వైకల్యం గల వ్యక్తులు, వారికి ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థలు భాగస్వాములు కావాలి, పూర్తి స్థాయిలో పనిచేయాలి.

## ఆర్టికల్ - 34: వైకల్యం గల వ్యక్తుల హక్కులపై కమిటీ

1. వైకల్యం గల వ్యక్తుల హక్కులపై ఒక కమిటీ ఏర్పాటు కావాలి (ఇకపై ఇది "కమిటీ " అని వ్యవహరించబడుతుంది.) ఈ కమిటీ ఈ దిగువన పేర్కొన్న విధులు నిర్వర్తిస్తుంది.
2. ఈ కమిటీ అమలులోకి వచ్చేటపుడు డజను మంది (12మంది) నిపుణులతో కూడి ఉంటుంది. ఈ ఒప్పందానికి అదనంగా అరవై రాటిఫికేషన్లు, లేదా / స్థాయిల తర్వాత, ఈ కమిటీ సభ్యుల సంఖ్య మరో ఆరు పెరుగుతుంది. ఈ విధంగా గరిష్ఠం 18 మంది సభ్యుల కమిటీ అవుతుంది.
3. కమిటీ సభ్యులు వారి వ్యక్తిగత హోదాలో పని చేయాలి, వారు అత్యంత సచ్ఛీలురై ఉండాలి, ప్రస్తుత ఒప్పందం స్పృశించే అంశాలలో తగిన అర్హత, అనుభవం ఉ ండాలి. ఆయా దేశాలు తమ అభ్యర్థులను ప్రతిపాదించే టప్పుడు, ప్రస్తుత ఒప్పందంలోని ఆర్టికల్ 4, పేరా 3లో పొందుపరచిన అంశానికి తగిన ప్రాధాన్యతను ఇవ్వవలసిందిగా కోరడమైనది.
4. కమిటీ సభ్యులను సభ్యదేశాలు ఎన్నుకుంటాయి. భౌగోళికంగా సమాన పంపిణీకి, వివిధ నాగరికతా రూపాలకు, మౌలిక న్యాయ వ్యవస్థలకు ప్రాధాన్యతనిస్తూ, జెండర్ ప్రాతినిధ్యం, వైకల్యంతో ఉన్న నిపుణుల భాగస్వామ్యానికి ప్రాముఖ్యత ఇవ్వాలి.
5. కమిటీ సభ్యులను ఆయాదేశాలు ప్రతిపాదించిన వ్యక్తుల జాబితాలనుంచి సభ్యదేశాల సమావేశంలో రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నుకోవడం జరుగుతుంది. ఈ సమావేశాలలో మొత్తం సభ్యదేశాలలో మూడింట రెండు వంతుల మంది హాజరైతే కోరం ఏర్పడినట్టు, హాజరైన దేశాల ప్రతినిధులు ఓటింగ్‌లో పాల్గొనగా అత్యధిక సంఖ్యలో ఓట్లు సంపాదించిన అభ్యర్థులు కమిటీ సభ్యులవుతారు.

6. మొట్టమొదటి కమిటీ ఎన్నిక ఈ ఒప్పందం అమలులోకి వచ్చిన ఆరునెలలు దాటక ముందు జరగాలి. ప్రతిసారి ఎన్నికలకు కనీసం నాలుగు నెలల ముందే ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ సభ్యదేశాలకు లేఖలు రాసి, వారి నామినేషన్లకు 2 నెలల వ్యవధిలో ప్రతిపాదించాలని కోరాలి. ఈ విధంగా నామినేట్ అయిన వ్యక్తుల పేర్లను అక్షరక్రమంలో వరుసలో పొందుపరచి, ఏదేశాలు వారిని నామినేట్ చేశాయో తెలుపుతూ తయారు చేసిన జాబితాను సెక్రటరీ జనరల్ ఈ ఒప్పంద సభ్యదేశాలకు అందజేయాలి.

7. కమిటీ సభ్యులు నాలుగేళ్ళ కాలానికి ఎన్నికవుతారు. వీరు మరొక్కసారి పునరెన్నిక కావడానికి అర్హులు అయితే మొదటి ఎన్నికలో ఎన్నికైన వారిలో ఆరుగురి పదవీకాలం రెండేళ్ళకు ముగుస్తుంది, మొదటి ఎన్నిక అయిపోయిన వెంటనే ఈ ఆర్టికల్‌లోని ఐదవ పేరాలో పేర్కొన్న ప్రకారం సమావేశపు చైర్‌పర్సన్ లాటరీ ద్వారా ఈ ఆరుగురు సభ్యుల పేర్లను ఎంపికచేస్తారు.

8. కమిటీలోని ఈ ఆరుగురు అదనపు సభ్యుల ఎన్నిక సాధారణ ఎన్నికల సందర్భంలో, ఈ ఆర్టికల్‌లోని సంబంధిత నిర్దేశాల ప్రకారం జరుగుతుంది.

9. ఎవరైనా సభ్యులు మరణించినా, లేక రాజీనామా చేసినా, లేక, మరే ఇతర కారణం చేతనైనా తాను ఇక విధులు నిర్వర్తించలేనని ఆమె/ఆయన ప్రకటించినా, సంబంధిత దేశం ఆసభ్యుని స్థానంలో తగిన అర్హతలు కలిగి, ఈ ఆర్టికల్‌లో నిర్దేశించిన అన్ని అర్హతలు కలిగిన మరొక నిపుణుడు/నిపుణురాలిని ఈ టర్మ్‌లో మిగిలిన కాలానికి పనిచేయడానికి నియమించాలి.

10. కమిటీ తన నిబంధనావళిని తానే రూపొందించుకోవాలి.

11. ఈ కమిటీ సమర్థవంతంగా తన విధులు నిర్వర్తించడానికి అవసరమైన సిబ్బంది, సదుపాయాలను ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ సమకూరుస్తారు. కమిటీ తొలి సమావేశాన్ని సెక్రటరీ జనరల్ నిర్వహిస్తారు.

12. ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం (జనరల్ అసెంబ్లీ) ఆమోదంతో ఈ కిమటీ సభ్యుల వేతన భత్యాలను ఐక్యరాజ్యసమితి వనరుల నుంచి, సర్వసభ్య సమావేశం నిర్ణయించిన షరతులు, నిబంధనల ప్రకారం అందుకుంటారు. ఈ కమిటీ బాధ్యతలను పరిగణనలోకి తీసుకుని సర్వసభ్య సమావేశం ఈ వేతన, భత్యాలను నిర్ణయిస్తుంది.

13. ఐక్యరాజ్యసమితి కన్వెన్షన్ ఆన్ ప్రివిలేజస్ అండ్ ఇమ్యూనిటీస్‌లోని సంబంధిత సెక్షన్లలో నిర్దేశించిన ప్రకారం సదుపాయాలు, హక్కులు, రక్షణలకు ఈ కమిటీ సభ్యులు అర్హులు.

**ఆర్టికల్ - 35: సభ్యదేశాల నివేదికలు**

1. ఆయాదేశాలు ఈ ఒప్పందాన్ని అమలులోకి తెచ్చిన రెండు సంవత్సరాలలోపు, ఈ ఒప్పందం క్రింద తమ బాధ్యతలను నిర్వర్తించడానికి తీసుకున్న చర్యలు, సాధించిన పురోగతిని తెలియజేస్తూ నివేదికలను ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ద్వారా కమిటీకి సమర్పించాలి.
2. ఆపై ఆయా సభ్యదేశాలు కనీసం నాలుగేళ్ళకి ఒకసారి లేదా కమిటీ కోరినపుడు నివేదికలను అందజేయాలి.
3. నివేదికలోని అంశాలకు వర్తించే మార్గదర్శకాలను కమిటీ నిర్ణయిస్తుంది.
4. సభ్యదేశాలు ముందు ఇచ్చిన సమగ్ర నివేదికలోని అంశాలను ఆతరువాతి నివేదకలలో పొందుపరచవలసిన అవసరంలేదు. కమిటికీ అందజేయడం కోసం సభ్యదేశాలు నివేదికలు రూపొందించే సందర్భంలో, పారదర్శకమూ, రహస్యానికి తావులేని పద్ధతిని పాటించాలని, ఈ ఒప్పందపు ఆర్టికల్ 4లోని మూడవ పేరాలో పొందుపరచిన అంశాలకు తగిన ప్రాధాన్యత నివ్వాలని కోరడమైనది.
5. ఈ ఒప్పందం కింద బాధ్యతలను నిర్వర్తించడంలో ఎదురయ్యే అంశాలు, అవరోధాలను నివేదికలలో పొందుపరచవచ్చు.

**ఆర్టికల్ - 36: నివేదికల పరిశీలన**

1. ప్రతి నివేదికను కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి అవసరమని భావించిన అంశాలపై సాదారణ సలహాలు, సూచనలు చేస్తూ సంబందిత వాటిని సభ్యదేశాలకు పంపుతుంది. సంబందిత దేశం తాను ఎంచుకున్న అంశాలపై కమిటీకి తన ప్రతిస్పందన తెలుపవచు.

   ఈ ఒప్పందం అమలుకి సంబందించి మరింత సమాచారాన్ని కమిటీ ఆయా దేశాల నుంచి కోరవచు.
2. ఏదైనా సభ్యదేశం ఎక్కువ కాలం పాటు నివేదికను సమర్పించకపోతే, కమిటీ ఆ ప్రభుత్వానికి ఈ ఒడంబడికను ఎలా అమలు చేస్తున్నారో పరిశీలించే అవసరం ఉందని నోటీసు పంపవచ్చు. ఆ నోటీసు పంపిన మూడు నెలలలోగా నివేదిక పంపకపోతే కమిటీ తనకు ఉన్న విశ్వసనీయ సమాచారం మేరకు సంబంధిత దేశంలో ఈ ఒప్పందం అమలును తనిఖీ చేయవలసివస్తుందని కమిటీ ప్రకటన

జారీచేయవచ్చు. ఈ తనిఖీలో పాల్గొనాలని సంబంధిత దేశాన్ని కమిటీ ఆహ్వానించాలి. సంబంధిత సభ్యదేశం, స్పందించి నివేదిక సమర్పిస్తే, ఈ ఆర్టికల్‌లోని ఒకటవ పేరా వర్తిస్తుంది.

3. అన్నిదేశాల నివేదికలను ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ అన్ని దేశాలకు అందజేస్తారు.
4. సభ్యదేశాలు తమ నివేదికలను తమతమ పౌరులకు విస్తృతంగా అందుబాటులో ఉంచి, సలహాలు, సూచనలు సిఫార్సులకు ఆస్కారం కల్పించాలి.
5. ఐక్యరాజ్య సమితి, సంబంధిత ఇతర సంస్థల నిధులు, కార్యక్రమాలను, ఆయాదేశాల నివేదికలను కమిటీ తాను సబబు అని భావించిన ప్రకారం ప్రత్యేక ఏజన్సీలకు బదలాయించి అవసరమైన సాంకేతిక సలహా లేదా సహాయాన్ని సూచికలను కోరవచ్చు. ఈ అభ్యర్థనలు, లేదా, సూచికలకు సంబందించి కమిటీ ఏమైనా అభిప్రాయాలను వ్యక్తం చేస్తే వాటిని కూడా జోడించాలి.

## ఆర్టికల్ - 37 : సభ్యదేశాలు, కమిటీ మధ్య సహకారం

1. ప్రతి ఒక్క సభ్యదేశమూ కమిటీకి సహకరించాలి, కమిటీ సభ్యులు వారి బాధ్యతలను నిర్వర్తించడంలో వారికి సహకరించాలి.
2. సభ్యదేశాలతో తన సంబంధాలలో భాగంగా కమిటీ ఈ ఒప్పందం ఆయాదేశాలలో పటిష్ఠంగా అమలు జరగడానికి దేశాల సామర్థ్యాలను పెంచేందుకు అంతర్జాతీయ సహకారంతో సహా అవసరమైన అన్ని మార్గాలను, పద్ధతులను గుర్తించాలి.

## ఆర్టికల్ - 38 : ఇతర విభాగాలతో కమిటీ సంబంధాలు

ఈ ఒప్పందం పటిష్ఠంగా అమలు జరగడం, దీనికిందకువచ్చే అన్ని అంశాలపై అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడం కోసం...

(ఎ) ప్రస్తుత ఒప్పందంలోని అంశాల అమలును సమీక్షించేటపుడు ఐక్యరాజ్య సమితి అంశాలు, ప్రత్యేక ఏజన్సీలు వారివారి బాధ్యతల పరిధిలో ప్రాతినిధ్యం వహించే హక్కు ఉంది. ఆయా విభాగాల, ఎజన్సీల పరిధిలోకి వచ్చే అంశాలపై నిపుణుల సలహాల కోసం అవసరమని భావిస్తే ఆ ఏజన్సీలు, విభాగాలను కమిటీ

ఆహ్వానించవచ్చు. అలాగే, ఆయా ఐరాస విభాగాలు, ప్రత్యేక ఏజన్సీల పరిధిలోని అంశాల అమలుపై నివేదికలు ఇవ్వాలనికూడా కమిటీ కోరవచ్చు.

(బి) కమిటీ తన విధులను నిర్వర్తించేటపుడు అవసరమైన ప్రకారం అంతర్జాతీయ మానవ హక్కుల ఒడంబడికల ద్వారా ఏర్పాటైన ఇతర సంస్థలను సంప్రదించడం ద్వారా వారివారి నివేదిక మార్గదర్శకాలలో, సూచనలు, సాధారణ సిఫార్సులలో ఏకాభిప్రాయం ఉండేలా, వారివారి విధుల నిర్వహణలో ఒకటే ఎక్కువ సార్లు పునరావృతం కాకుండా ఒకదానిపై మరొకటి కాకుండా చూడాలి.

**ఆర్టికల్-39:కమిటీ నివేదిక**

కమిటీ తన కార్యకలాపాలపై ప్రతి రెండేళ్ళకు ఒకసారి ఐరాస జనరల్ అసెంబ్లీకి ఆర్థిక-సాంఘీక మండలికి నివేదిక సమర్పించాలి. సభ్యదేశాల నుంచి అందిన నివేదికలపై సూచనలు, సాధారణ సిఫార్సులు చేయవచ్చు. ఇలాంటి సలహాలు, సాధారణ సిఫార్సులను ఆయా సభ్యదేశాల వ్యాఖ్యలతో సహా కమిటీ నివేదికకు జతచేయాలి.

**ఆర్టికల్- 40:సభ్యదేశాల సమావేశం**

1. ప్రస్తుత ఒప్పందం అమలుకి సంబంధించిన ఏ అంశాన్నైనా చర్చించేందుకు సభ్యదేశాలు క్రమం తప్పకుండా సభ్యదేశాల సమావేశాలలో పాల్గొనాలి.
2. ఈ ఒప్పందం అమలులోకి వచ్చిన నాటి నుంచి ఆరునెలలు దాటకుండా సభ్యదేశాల సమావేశాన్ని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఏర్పాటు చేయాలి. ఆపై రెండేళ్ళకి ఒకసారిగాని, లేదా సభ్యదేశాల సమావేశంలో నిర్ణయించిన ప్రకారం గాని ఏర్పాటు చేయాలి.

**ఆర్టికల్-41:సంరక్షణ(డిపాజిటరీ)**

ప్రస్తుత ఒప్పందం సంరక్షకులు (డిపాజిటరీ) ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్.

**ఆర్టికల్ - 42 : సంతకం**

ఈ ఒప్పందం 2007 మార్చి 30 నాటికి ఏదేశమైనా, ఏప్రాంతీయ సమైఖ్య సంస్థ (రీజనల్ ఇంటిగ్రేషన్ ఆర్గనైజేషన్) అయిన సంతకం పెట్టడానికి అందుబాటులో ఉంది.

**ఆర్టికల్-43: ఆమోదం తప్పనిసరి**

ప్రస్తుత ఒప్పందం సంతకాలు చేసే దేశాల ఆమోదం, సంతకం చేయని , సంతకం చేసే ప్రాంతీయ సమైక్య సంస్థల లాంఛన ప్రాయ నిర్ధారణకు లోబడి ఉంది. ఏదేశానికైనా, ఏ ప్రాంతీయ సమైఖ్య సంస్థలకైనా ఇది అందుబాటులో ఉంటుంది.

**ఆర్టికల్-44: ప్రాతీయ సమైఖ్య సంస్థలు**

1. ప్రాంతీయ సమైఖ్య సంస్థ అంటే –ఒక నిర్ధిష్ఠ ప్రాంతంలోని సార్వభౌమాధికార దేశాలు ఏర్పరచిన సంస్థ. ఆ దేశాలు ఈ ఒప్పందానికి సంబంధించిన అంశాల పర్యవేక్షక బాధ్యతను ఈ సంస్థకు అప్పగించినవి. ఈ సంస్థలు, ప్రస్తుత ఒప్పందలోని అంశాలకు సంబంధించి తమ అధికార పరిధిని తమ లాంఛనప్రాయ నిర్ధారణలో స్పష్ఠం చేయాలి. ఆపై, తమ అధికార పరిధిలో ఏవైనా మార్పులు జరిగినపుడు ఆ విషయాన్ని ఈ ఒప్పందపు సంరక్షణాధికారి అయిన ఐరాస సెక్రటిరీ జనరల్‌కు తెలియజేయాలి.
2. ఈ ఒప్పందంలోని "సభ్యదేశాలు" అన్న సందర్భాలలో ప్రాంతీయ సమైఖ్య సంస్థలకు వారి అధికార పరిధుల మేరకు వర్తిస్తుంది.
3. ఈ ఒప్పందంలోని ఆర్టికల్ 45లోని ఒకటవ పేరా, ఆర్టికల్ 47లో రెండు, మూడు పెరాల కోసం, ప్రాంతీయ సమైఖ్య సంస్థలు సంరక్షణ వహించే ఎలాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవడం జరగదు.
4. ప్రాంతీయ సమైఖ్య సంస్థలు, తమ పరిధిలోని అంశాలకు సంబంధించి సభ్య దేశాల సమావేశాలలో తమ సభ్య దేశాల సంఖ్యకు సమాన సంఖ్యలో ఓట్లు వేయవచ్చు. తన సభ్య దేశాలలో ఏదేని దేశం స్వయంగా ఓటింగ్‌లో పాల్గొంటే, సంస్థ ఆ ఓటును వినియోగించుకో జాలదు. అలాగే, ఈ సంస్థ ఓటు వేసేట్లయితే, సంబంధిత దేశాలకు ఓటు చేసే హక్కు ఉండదు.

**ఆర్టికల్-45: అమలు ప్రారంభం**

1. 20వ అంశాన్ని రాటిఫై (లేదా ఆమోదం) భద్రపరచిన నాటినుంచి 30 వరోజున ఈ ఒప్పందం అమలులోకి వస్తుంది.
2. ప్రతిదేశం, లేదా ప్రాంతీయ సమైఖ్య సంఘం ప్రస్తుత ఒప్పందాన్ని రాటిఫై చేయడానికి, లేదా లాంఛనంగా ఆమోదం తెలపడానికి 20వ అంశాన్ని డిపాజిట్ చేసిన నాటినుండి 30 వ రోజున ఈ ఒప్పందం అమలులోకి వస్తుంది.

**ఆర్టికల్-46: రిజర్వేషన్లు**

1. ప్రస్తుత ఒప్పందపు లక్ష్యాలు, ఆశయాలకు సరితూగని రిజర్వేషన్లు అనుమతించ బడవు.
2. రిజర్వేషన్లను ఎప్పుడైనా ఉపసంహరించవచ్చు.

**ఆర్టికల్-47: సవరణలు**

1. సభ్యదేశాలు ఏవైనా ఈ ఒప్పందంలో సవరణలను ప్రతిపాదించవచ్చు, వాటిని ఐరాస సెక్రటరీ జనరల్‌కు అందజేయవచ్చు. సవరణ ప్రతిపాదనలు వేటినైనా సెక్రటరీ జనరల్ అన్ని సభ్యదేశాలకు తెలియజేసి, ఈ సవరణలపై నిర్ణయించడానికి, చర్చించడానికి సభ్య దేశాలు సమావేశం ఏర్పాటు చేయాలని ఆయా దేశాలు భావిస్తున్నాయేమో తెలియ జేయవలసిందిగా కోరాలి. ఇలాంటి సమాచారానికి స్పందిస్తూ కనీసం మూడింట ఒకవంతు దేశాలు సమావేశం నిర్వహించాలని సమాచారం అందిన నాలుగు నెలలలోగా కోరితే ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో సెక్రటరీ జనరల్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయాలి. ఇలా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న సభ్య దేశాలలో మూడింట రెండు వంతుల సభ్య దేశాలు ఏదైనా సవరణను ఆమోదిస్తే, సెక్రటరీ జనరల్ దానిని ఐరాస ఆమోదంకోసం ఐరాస జనరల్ అసెంబ్లీకి సమర్పించాలి, ఆపై ఆమోదం కోసం సభ్యదేశాలన్నిటికీ పంపాలి.
2. ఒకటవ పేరాలో నిర్దేశించిన ప్రకారం ఆమోదంపొందిన సవరణలు వీటికి ఆమోదం తెలిపిన దేశాల సంఖ్య రెండింట మూడు వంతులకు చేరిననాటి నుంచి 30 వరోజున అమలులోకి రావాలి. ఆపై, ఆయాసభ్యదేశాలు ఆమోదంతెలిపిన నాటినుంచి 30వరోజున ఆయాదేశాలలో అమలులోకి రావాలి. ఆమోదం తెలిపిన దేశాలకు మాత్రమే ఈసవరణలను అమలుచేసి తీరవలసిన బాధ్యత ఉంటుంది.

3. సభ్యదేశాల సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదిస్తే, ఈ ఒప్పందంలోని 34,38,39,40 ఆర్టికల్స్‌కి సంబంధించిన అంశాలపై ప్రస్తుత ఆర్టికల్‌లోని ఒకటవ పేరా ప్రకారం మూడింట రెండు వంతుల మెజారిటీతో ఆమోదం పొందే సవరణలు, ఆమోదంపొందిన నాటినుంచి 30వ రోజున అన్ని సభ్యదేశాలలో అమలులోకి వస్తాయి.

**ఆర్టికల్ – 48 : నిరసన**

సభ్య దేశమెదైనా ప్రస్తుత ఒప్పందానికి నిరసనను లిఖితపూర్వక ప్రకటన ద్వారా ఐరాస సెక్రటరీ జనరల్‌కు తెలియజేయవచ్చు. ఈ నిరసన ప్రకటన సెక్రటరీ జనరల్‌కు అందిన తరువాత ఏడాదికి అమలులోకి వస్తుంది.

**ఆర్టికల్ – 49 : వీలైన రూపంలో ఒప్పందం పూర్తిపాఠం**

ప్రస్తుత ఒప్పందపు పూర్తి పాఠాన్ని వీలైన రూపాలలో అందుబాటులోకి తేవాలి.

**ఆర్టికల్ – 50 : అధికృత పూర్తిపాఠం**

అరబిక్, చైనీస్, ఇంగ్లీష్, ఫ్రెంచ్, రష్యన్, స్పానిష్ భాషలలో లభించే ఈ ఒప్పందపు పూర్తిపాఠం సమానంగా అధీకృతమైనవి (ఆథెంటిక్).

this is for your information only, we are not authentic any judiciary maters